జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED



గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉల్లా స్టాఫ్ రిపోర్టర్, విలేఖరుల ఇంచార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
94402 31967

రంగారెడ్డి | మంగళవారం 3 నవంబర్ 2026 | సంపుటి : 17 | సంచిక : 111 | పేజీలు : 8 | వెల : 1/-

RNI NO.APTEL/2010/36516

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, సూర్య చంద్రుల సమయాలు సూర్యోదయం : 5:28 , సూర్యాస్తమయం : 6:32 , చంద్రోదయం : 3:38 చంద్రాస్తమయం : 3:07 పంచాంగం, తిథి : శుద్ధ ద్వాదశి రా. 10:31 వరకు, తర్వాత త్రయోదశి, నక్షత్రం: విశాఖ రా. 8:10 వరకు, తర్వాత అనూరాధ, యోగం : సిద్ధం మ. 1:19 వరకు, తర్వాత సాధ్యం, కరణం: బవ ఉ. 9:47 వరకు, తర్వాత బాలవ రా. 10:31 వరకు, తర్వాత కౌలవ

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail : prajajyothidaily@gmail.com

బియ్యం అక్రమార్కులపై కొరడా



రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, దారి మళ్లింపుపైనా కేసులు

25 కిలోల బస్తాపై 26 కిలోల లేబుల్..

ఎంఆర్‌పీపై అధిక ధరల స్టిక్కర్లు

దుకాణాలు మూసి, అక్రమాలను సరిచేసుకునే పనిలో వా

హైదరాబాద్: రాష్ట్రంలో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కృత్రిమ కొరత సృష్టిస్తూ వినియోగదారులను దోపిడీ చేస్తున్న వ్యాపారులపై పౌరసరఫరాల శాఖ దాడుల్లో భారీ అక్రమాలు వెలుగు చూశాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మూడు రోజులపాటు అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 18 వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకోగా, 11 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్), తూనికలు, కొలతల శాఖ (లీగల్ మెట్రాలజీ) అధికారులు సంయుక్తంగా గత నెల 29 నుంచి 31 వరకు రిటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. బియ్యం విక్రయాల్లో వ్యాపారులు అనుసరిస్తున్న అక్రమ పద్ధతులు తనిఖీల్లో బయటపడ్డాయి. ముఖ్యంగా 25 కిలోల బియ్యం బస్తాలపై 26 కిలోలుగా పేర్కొంటూ లేబుళ్లు అతికించి వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. బస్తాపై ముద్రించిన అసలు ధరను తొలగించకుండా, దానిపై ఎక్కువ ధరలతో కొత్త స్టిక్కర్లు అతికించి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కంపెనీలు నిర్ణయించిన ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించేందుకు ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు కొన్ని వ్యాపార సంస్థలు అవసరమైన అనుమతులు, లైసెన్సులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, కార్మిక శాఖ అనుమతులు, ఆహార భద్రతా ప్రమాణాలకు సంబంధించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. మరోవైపు ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, దారి మళ్లింపు వ్యవహారాలపైనా అధికారులు దృష్టి సారించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, వాటిని రీసైక్లింగ్ చేసి 26 కిలోల బ్రాండెడ్ బ్యాగుల్లో నింపి విక్రయించినట్లు తేలింది. బియ్యం సరఫరా, నిల్వలు, విక్రయాల తీరును పరిశీలిస్తూ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న సంస్థలపై ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా, సరూర్‌నగర్, జీడిమెట్ల, అల్వాల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 11 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి చట్టప్రకారం ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని పేర్కొంది. పౌరసరఫరాల శాఖ దాడుల నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని రైస్ మిల్లర్లు, ట్రేడర్స్, హోల్‌సేల్ డిపోలు, రిటైలర్లు అప్రమత్తమయ్యారు. గత రెండు రోజులుగా షాపుల షట్టర్స్ మూసివేసి 26 కిలోల బ్యాగుల్లో తక్కువగా ఉన్న బియ్యాన్ని సరిచేయడం, లేదంటే వేరే గోడౌన్‌లకు తరలించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. చౌకధరల దుకాణాల ద్వారా సేకరించిన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి బ్రాండెడ్ లేబుళ్లు ఉన్న బస్తాల్లో నింపి విక్రయిస్తున్న మిల్లర్లు, రైస్ డిపోల హోల్‌సేల్ వ్యాపారులు కూడా అప్రమత్తమయ్యారు.

బాలకృష్ణ నగర్ కాలనీల అభివృద్ధికి మరో ముందడుగు



సీసీ రోడ్డు ప్రారంభించిన ఆకారపు అరుణ్ పటేల్

ఉప్పల్, నవంబర్ 02 (ప్రజాజ్యోతి): 14 కోట్లు సీసీ రోడ్డు సాంక్షన్ చేయించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి కి కాలనీ వాసులు కృతజ్ఞతలు బాలకృష్ణ నగర్ ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3, సాబీరా కాలనీ మరియు కురుమ నగర్ ప్రాంతాల్లో సుమారు రూ. 14 కోట్ల వ్యయంతో నూతన రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టడం జరిగింది. గతంలో బస్తీ బాట కార్యక్రమం లో భాగంగా ఆయా కాలనీల్లో పర్యటించి, బస్తీ బాట ద్వారా కాలనీవాసుల సమస్యలను స్వయంగా తెలుసుకుని, రోడ్ల దుస్థితిని పరిశీలించి, వారి విజ్ఞప్తి మేరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్ల మంజూరుకు కృషి చేయడం జరిగింది.

ఉప్పల్‌లో హత్య కుట్ర భగ్నం



ఆర్ఫాజ్‌ను హతమార్చేందుకు పథకం.. ఐదుగురి అరెస్ట్

రెండు నాటు తుపాకులు, 8 తూటాలు, మూడు కత్తులు స్వాధీనం... మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి

ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధమైన సంస్థల పరిరక్షణ కోసం బిజెపి నిరంతరం కృషి

ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం, అరాచకాన్ని తరిమికొడదాం

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజేంద్రనగర్ నుంచి భారీ తరలింపు



ఉప్పల్‌లో హత్య కుట్ర భగ్నం

ఆర్ఫాజ్‌ను హతమార్చేందుకు పథకం.. ఐదుగురి అరెస్ట్

రెండు నాటు తుపాకులు, 8 తూటాలు, మూడు కత్తులు స్వాధీనం... మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి





ఉప్పల్, నవంబర్ 02,(ప్రజాజ్యోతి) పాత కక్షలు ప్రతీకారేచ్ఛ హత్యకు కుట్ర! ఓ వ్యక్తిని హతమార్చేందుకు పథకం సిద్ధం చేసుకున్న ఐదుగురిని మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఉప్పల్ పోలీసులతో కలిసి ఎస్‌వోటీ ఎల్బీనగర్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఈ కుట్ర వెలుగుచూసింది. నిందితుల నుంచి రెండు నాటు తుపాకులు, 8 తూటాలు, మూడు కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆటోతో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

'మూసీ పరివాహక ప్రాంతంలో అనుమానాస్పదంగా"

నవంబర్ 2న ఉదయం ఉప్పల్ శిల్పారామం వెనుక మూసీ నది సమీపంలోని ఖాళీ ప్రదేశం లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు, ఓ ఆటోతో ఐదుగురు అనుమానాస్పదం గా కనిపించడంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఇద్దరి వద్ద రెండు నాటు తుపాకులు, 8 తూటాలు, మూడు కత్తులు లభించాయి. విచారణలో ఆర్ఫాజ్ అనే వ్యక్తిని హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు.

"పాత హత్యలకు ప్రతీకారంగా మరో హత్యకు కుట్ర"

పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. దాసరి సురేందర్ అలియాస్ సూరి తన భార్య షబాపై అనుమానంతో ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలున్నాయి. అనంతరం 2024లో షబా సోదరుడు సల్మాన్‌ను కూడా హత్య చేసినట్లు కేసులున్నాయి. ఈ క్రమంలో షబా మరో సోదరుడు ఆర్ఫాజ్.. జులై 2026లో సురేందర్‌ను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో జైలుకు వెళ్లిన ఆర్ఫాజ్ ఇటీవల విడుదలయ్యాడు. దీంతో సురేందర్ అనుచరులుగా ఉన్న ఐదుగురు అతడిపై ప్రతీకారం తీర్చుకోవాలని హత్యకు కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది.

"బీహార్ నుంచి తుపాకుల కొనుగోలు"

కుట్రలో భాగంగా తనయ్ కుమార్ అలియాస్ కన్నా, షేక్ అక్బర్ కలిసి ఆదిత్య కుమార్ ఠాకూర్‌కు ఫోన్‌పే ద్వారా రూ. 35 వేల నగదు పంపినట్లు పోలీసులు గుర్తించారు. ఆదిత్య బీహార్‌లోని భాగల్పూర్ జిల్లా సైద్‌పూర్ దభ్రా ప్రాంతానికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తి నుంచి రూ.30 వేలకు రెండు నాటు తుపాకులు, ఆరు తూటాలు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. మూడు కత్తులను కూడా కొనుగోలు చేసినట్లు తెలిపారు.

పోలీసుల అప్రమత్తతతో తప్పిన ఘోరం

ఆర్ఫాజ్‌ను హతమార్చే పథకాన్ని అమలు చేసేందుకు ఐదుగురు నవంబర్ 2న ఉదయం మూసీ నది సమీపంలో సమావేశమయ్యారు. అయితే ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో హత్య కుట్ర భగ్నమైంది తెలిపిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి

నిందితుల వివరాలు..

తొకట తనయ్ కుమార్ అలియాస్ కన్నా (26) -- లోన్ రికవరీ ఏజెంట్, ఉప్పల్.

షేక్ అక్బర్ (26) -- ఆటో డ్రైవర్, మీర్‌పేట.

ఆదిత్య కుమార్ ఠాకూర్ (33) -సెక్యూరిటీ గార్డు, ఉప్పల్.

దుడాని లక్ష్మణ్ సింగ్ అలియాస్ సోను (27) -- వెల్డింగ్ కార్మికుడు, కొత్తపేట.

వడ్డా వెంకటేశ్ అలియాస్ నాని (22)-ఆటో డ్రైవర్, అల్మాస్‌గూడ.

వీరిలో లక్ష్మణ్ సింగ్ చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా ఉన్నట్లు, అతడిపై గతంలో 30 క్రిమినల్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. అందులో రెండు హత్య కేసులు కూడా ఉన్నాయని వెల్లడించారు.

స్వాధీనం చేసుకున్నవి

రెండు నాటు తుపాకులు

8 తూటాలు (6 ఖఖీ 7.65, 2 ఖఖీ 8 వీవీ)

మూడు కత్తులు

రెండు హోండా యాక్టివా వాహనాలు

ఒక ఆటో

నాలుగు సెల్‌ఫోన్లు

అక్రమ ఆయుధాలు కలిగి ఉండటం, వ్యక్తిగత కక్షలతో హత్యలకు కుట్ర పన్నడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి పోలీసులు హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే సమీప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని సిపి సుమతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రతి వార్డు అభివృద్ధే లక్ష్యం!

చేవెళ్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి

11వ వార్డు ఇబ్రహీంపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చేవెళ్ల, నవంబర్ 02(ప్రజా జ్యోతి): మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ చేవెళ్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా 11వ వార్డు ఇబ్రహీంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రాధాన్యతని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో స్థానిక అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులను మెరుగుపరుస్తూ ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా వివక్షకు తావులేకుండా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేష్, వార్డు మెంబర్ రవీందర్ గౌడ్, చేవెళ్ల నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాన్ పాషా, మున్సిపల్ మైనారిటీ అధ్యక్షుడు అజీమ్, గ్రామస్తులు బాల్ రెడ్డి, దర్శన్ గౌడ్, శివకుమార్, షాబుద్దీన్, పైండ్ల ప్రశాంత్ రెడ్డి, బషీర్, సలీం, బాలయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి.!

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి

సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు



ఇబ్రహీంపట్నం నవంబర్ 2 ప్రజాజ్యోతి: సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 116 ఫిర్యాదులు అందాయి. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని,ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 67 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించి 49 ఫిర్యాదులు అందాయి. మొత్తం 116 అర్జీలు స్వీకరించిన అధికారులు వాటిని సంబంధిత శాఖలకు పంపించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి.. డంపింగ్ యార్డ్‌ను విరమించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

సిద్ధాపూర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న పోరాటానికి రిలే నిరాహార దీక్షకు అంజయ్య యాదవ్ సంఘీభావం



కొత్తూరు నవంబర్ 02 (ప్రజా జ్యోతి) సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ, జీవో నంబర్ 641ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 30వ రోజు రిలే నిరాహార దీక్షలో పోల్కోనిగుట్ట తండా ప్రజలు పాల్గొన్నారు. ఈ నిరాహార దీక్షలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని తన సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల జీవించే హక్కులను, రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. రైతుల భూములు, ప్రజల నీరు, గాలి, భవిష్యత్తును కాపాడేందుకు జరుగుతున్న ఈ పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకుని జీవో నంబర్ 641ను రద్దు చేయాలని, డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు, జేఏసీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమనికి అధ్యక్షత సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మూడవత్ రాంబల్ నాయక్, మాజీ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ సర్పంచ్ వడ్డె బాలయ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మెండె కృష్ణయ్య, సర్పంచ్ రాత్లావత్ భాస్కర్ నాయక్, మాజీ సర్పంచ్ మూడవత్ లక్ష్మణ్ నాయక్, మూడవత్ రమేష్ నాయక్, మూడవత్ తారాసింగ్, పాల్త రాజు నాయక్, మూడవత్ హరిరామ నాయక్, కేతావత్ వినోద్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శ్రీధర్ చారి, నరేందర్ రెడ్డి, నజీర్, బాబురాజ్ నాయక్, నగేష్ నాయక్, గూని మహేష్, మల్లేష్, మహేష్, ప్రతాప్ రెడ్డి, కృష్ణ రెడ్డి, రాజప్ప, జైపాల్, బి.శేఖర్, శ్రీనివాస్, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొండన్నగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతల చేయూత

50 మందికి ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌లు, షూస్ పంపిణీ



షాద్‌నగర్ నవంబర్ 2(ప్రజాజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు కుమ్మరి బ్రహ్మయ్య, కమ్మరి నవీన్ సహకారంతో ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌లు, షూస్ పంపిణీ చేశారు.గత ఏడాది కేవలం 12 మంది విద్యార్థులతో కొనసాగిన పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల కృషితో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 50కి చేరింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్యతోపాటు క్రీడారంగంలోనూ ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, పెన్నులు, స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు కూడా సహకరించినట్లు తెలిపారు. విద్యార్థుల అవసరాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వెల్లడించారు.అనంతరం గ్రామ అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి సహకారం అందిస్తున్న కుమ్మరి బ్రహ్మయ్య, కమరి నవీన్‌లను గ్రామస్తులు శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గారావు, నూకరాజు, విలేజ్ సెక్రటరీ నాగమణి, కూల్ చైర్మన్ ఈశ్వరమ్మ, సర్పంచ్ అనురాధ, సురేష్ గౌడ్, ఉపసర్పంచ్ నరసింహులు యాదవ్, మాజీ సర్పంచ్ వై. శ్రీనివాస్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ జై ఆంజనేయులు గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలే భావితరాలకు జీవనాధారం!

ఈర్లపల్లి పాఠశాలలో తువాక్కం వెల్ఫేర్ అసోసియేషన్ హరిత కార్యక్రమం

మొక్కలు నాటి.. పచ్చదనాన్ని కాపాడాలి

సర్పంచ్ లావణ్య రాజశేఖర్





చేవెళ్ల నవంబర్ 02 (ప్రజా జ్యోతి):పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈర్లపల్లి సర్పంచ్ లావణ్య రాజశేఖర్ పిలుపునిచ్చారు. తువాక్కం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈర్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చెట్లు ప్రకృతికి ప్రాణాధారమని, పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని అన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించాలని, నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దయాకర్, మాజీ సర్పంచ్ రాజశేఖర్, వార్డు సభ్యులు అనూష, కావలి సంతోష, సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, విజయలక్ష్మి, చైతన్య, మాధురి, తువాక్కం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ నగర్ కాలనీల అభివృద్ధికి మరో ముందడుగు

సీసీ రోడ్డు ప్రారంభించిన ఆకారపు అరుణ్ పటేల్

ఉప్పల్, నవంబర్ 02 (ప్రజాజ్యోతి):14 కోట్లు సీసీ రోడ్డు సాంక్షన్ చేయించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి కి కాలనీ వాసులు కృతజ్ఞతలు బాలకృష్ణ నగర్ ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3, సాబీరా కాలనీ మరియు కురుమ నగర్ ప్రాంతాల్లో సుమారు రూ.14 కోట్ల వ్యయంతో నూతన రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టడం జరిగింది. గతంలో బస్తీ బాట కార్యక్రమం లో భాగంగా ఆయా కాలనీల్లో పర్యటించి, బస్తీ బాట ద్వారా కాలనీవాసుల సమస్యలను స్వయంగా తెలుసుకుని, రోడ్ల దుస్థితిని పరిశీలించి, వారి విజ్ఞప్తి మేరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్ల మంజూరుకు కృషి చేయడం జరిగింది.ఆ కృషి ఫలితంగా రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే మా ప్రధాన లక్ష్యం. ఈ అభివృద్ధి పనులకు సహకరించిన ప్రతి



ఒక్కరికీ, ముఖ్యంగా విజ్ఞప్తి చేసిన కాలనీవాసులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.ప్రజల విజ్ఞప్తే మా బాధ్యత.. ప్రజల అభివృద్ధే మా లక్ష్యం! ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు నామ్ రాజ్ రెడ్డి బాలకృష్ణ నగర్ అధ్యక్షులు తిక్కరెడ్డి వేణుగోపాల్ చారి కాసిమ్ గౌడ్ సబీరా



కాలనీ అధ్యక్షుడు మహమ్మద్ అశ్వక్ కాలనీవాసులు స్వామి నాగరాజు బ్రహ్మయ్య అరుణ్ సాయి నరసింహ రఘు సాయి నాగమల్లయ్య కిషోర్ భాను భాస్కర్ రంజిత్ రెడ్డి కృష్ణ గౌడ్ జలంధర్ కృష్ణ నవీన్ భాష నాగేష్ బాలాజీ చారి ప్రవంతి నాగేష్ రాము శిమ్ము పవన్ విష్ణు కాలనీ వాసులు పాల్గొన్నారు

ఐసిఎఆర్- నార్మ్ లో నాయకత్వ శ్రేష్ఠత'పై కార్యనిర్వాహక అభివృద్ధి కార్యక్రమం ముగింపు

ముఖ్య అతిథిగా హాజరైన ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్

రాజేంద్రనగర్, నవంబర్ 02 (ప్రజా జ్యోతి) ఐసిఎఆర్ పరిశోధన నిర్వహణ నిపుణుల కోసం 'నాయకత్వ శ్రేష్ఠత' అంశంపై రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని ఐసిఎఆర్-నార్మ్ లో నిర్వహించిన కార్యనిర్వాహక అభివృద్ధి కార్యక్రమం 2026 నవంబర్ 1న ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి డిఎఆర్ఈ కార్యదర్శి మరియు ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్.జాట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జాట్ మాట్లాడుతూ భారతదేశ వ్యవసాయ పరిశోధన అజెండాను అభివృద్ధి చెందుతున్న ప్రపంచ సవాళ్లకు అనుగుణంగా మార్చడానికి వ్యూహాత్మక, అనుకూల దృష్టిని అభివృద్ధి చేయాలని, చురుకైన నిర్ణయాలను ప్రోత్సహించాలని నొక్కి చెప్పారు. పరిశోధన ఫలితాలు క్షేత్రస్థాయి సవాళ్లను పరిష్కరించేలా, గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరిచేలా రైతు-కేంద్రీకృత ఆవిష్కరణల వైపు మార్పు రావాలని పిలుపునిచ్చారు. సంస్థాగత చురుకుదనాన్ని పెంచాలని, ఆర్ఎంపి అధికారులు సమకాలీన కార్యనిర్వాహక



నిర్వహణ నైపుణ్యాలతో సన్నద్ధం కావాలని సూచించారు. వనరుల కేటాయింపు, ఆర్థిక, మౌలిక సదుపాయాలు, మానవ వనరుల సమర్థవంత వినియోగంపై దృష్టి పెట్టాలని, సంస్థాగత నాయకత్వంలో పటిష్టమైన రెండవ శ్రేణిని తయారు చేసేందుకు మధ్య-వయస్సు శాస్త్రవేత్తలకు మార్గదర్శకత్వం వహించాలని అన్నారు. నార్మ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మీనాక్షి సుందరం అధ్యక్షోపన్యాసం చేస్తూ పరిశోధన నాయకత్వం, సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో కార్యనిర్వాహక అభివృద్ధి



ప్రాముఖ్యతను వివరించారు. ప్రోగ్రామ్ డైరెక్టర్, మానవ వనరుల విభాగం అధిపతి డాక్టర్ బి.గణేష్ కుమార్ కార్యక్రమ నివేదికను సమర్పించారు. జాయింట్ డైరెక్టర్, ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ వందన సమర్పణ చేశారు.నార్మ్ లో నిర్వహించిన 19వ ఈడిపికి ఒక ఐసిఎఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్స్, వివిధ ఐసిఎఆర్ సంస్థల డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లతో సహా 13 మంది సీనియర్ వ్యవసాయ పరిశోధన నాయకులు హాజరయ్యారు.

ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధమైన సంస్థల పరిరక్షణ కోసం బిజెపి నిరంతరం కృషి

ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం, అరాచకాన్ని తరిమికొడదాం

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

తోకల శ్రీనివాస్ రెడ్డి అధ్వర్యంలో పాదయాత్రకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజేంద్రనగర్ నుంచి భారీ తరలింపు

రాజేంద్రనగర్, నవంబర్ 02 (ప్రజా జ్యోతి) ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధమైన సంస్థల పరిరక్షణ కోసం బిజెపి నిరంతరం కృషి చేస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం -- అరాచకాన్ని తరిమికొడదాం'మహా పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.



రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాటేదాన్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఊపి మహా పాదయాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధమైన సంస్థల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం



కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రజల హక్కులను కాపాడడం బీజేపీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, వివిధ మండలాలు, మున్సిపాలిటీల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీ బహిరంగ సభలో అమిత్‌షా ప్రసంగం.

భారత్ మాతాకీ జై, జైశ్రీరాం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన అమిత్‌షా.

ఉప్పల్,నవంబర్ 02,(ప్రజాజ్యోతి):తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం కావాలా.?వద్దా.?. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.. అరాచకత్వాన్ని అంతం చేయాలి. సర్దార్ పటేల్ లేకుంటే.. హైదరాబాద్ భారతదేశంలో విలీనం అయ్యేదే కాదు. ఢిల్లీ లో కాంగ్రెస్ నిర్వహించింది ఓట్ బచావో ర్యాలీ కాదు.. చొరబాటు దారులను రక్షించే ర్యాలీ. తెలంగాణలో కాంగ్రెస్‌ను గద్దె దించాల్సిన సమయం వచ్చింది. కాంగ్రెస్ 13 కోట్ల ఓట్లు రద్దయ్యాయని అబద్ధాలు ప్రచారం చేస్తోంది. ఆరున్నర కోట్ల ఓట్లు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారి ఓట్లు తొలగించారు మూడు కోట్ల మంది చనిపోయినవారి ఓట్లు తొలగించారు.)చనిపోయినవారి ఓట్లు తొలగించాలా.?లేదా.? మరో కోటి ఓట్లు డూప్లికేట్ ఓట్లను తొలగించారు.. మరి వాటిని తొలగించాలా వద్దా.? ఇవన్నీ తొలగిస్తుంటే.. రాహుల్ గాంధీకి కడుపుమంటగా ఉంది. చొరబాటుదారుల్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని కాంగ్రెస్ చూస్తోంది. ఇండి కూటమి సర్ ని ఆపాలని చూస్తోంది. ప్రజల ఆదరణతో మోడీ గెలిచారు.. సర్ తో కాదు. సర్ జరగకముందు కూడా అనేక ఎన్నికల్లో బీజేపీ గెలిచింది. 2014లో మోడీ గెలిచారు.. అప్పుడు సర్







జరిగిందా.? భవిష్యత్తులోనూ తెలంగాణలో బీజేపీ గెలుస్తుంది. రాహుల్ ఎప్పటికీ దేశ ప్రధాని కాలేరు. గెలిస్తే ప్రజలు గెలిపించినట్టు.. ఓడితే ఈవీఎంలపై నెపం వేస్తున్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా కాంగ్రెస్ పరిస్థితి ఉంది. ఈవీఎంలను రాహుల్‌గాంధీ తప్పు పడుతున్నారు. అదే నిజమైతే తెలంగాణలో రేవంత్ ఎలా సీఎం అయ్యారు? కేరళం, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎలా గెలుపొందింది.

ఎండిన పంట పొలాల సర్వేను పరిశీలించిన వ్యవసాయ అధికారి

రైతులు అందుబాటులో ఉండి పంట నష్ట వివరాలు నమోదు చేయించుకోవాలి



ప్రజాజ్యోతి,ఆమనగల్లు, నవంబర్ 2::-మండల పరిధిలో ఎండిన పంట పొలాల సర్వే ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు ముమ్మరం చేశారు. సోమవారం వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ షెడ్యూల్ ప్రకారం కోనాపూర్, శెట్టిపల్లి, పోలేపల్లి గ్రామాల్లో పర్యటించి ఎండిన పంట పొలాల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రైతులు తమ గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులకు తమ ఎండిన పంట పొలాలను ప్రత్యక్షంగా చూపించి, పంట నష్టానికి సంబంధించిన విస్తీర్ణ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. సర్వే సమయంలో రైతులు సహకరించి సరైన వివరాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనాపూర్ సర్పంచ్ శ్రీలత, శెట్టిపల్లి సర్పంచ్ జంగమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు భూదేవి, మీనాక్షి, ప్రభావతి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అమిత్ షా పాదయాత్రలో పాల్గొన్న విక్రమ్ నాథ్, దొడ్డి నరహరి

సంఘీభావం తెలిపిన తెలంగాణ రాష్ట్ర అమిత్ షా యువ సంఘటన్ రాష్ట్ర నాయకులు



హైదరాబాద్, నవంబర్ 02 (ప్రజా జ్యోతి) : కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహా పాదయాత్రలో తెలంగాణ రాష్ట్ర అమిత్ షా యువ సంఘటన్(ఆర్.ఏ.ఎస్.వై.ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాథ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దొడ్డి నరహరి, నాయకులు కే.ఏడుకొండలు, మునగాల సంపత్ రెడ్డి, అంకిత్ శుక్లా, ఆడే విక్రమ్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, అరాచకవాదానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఈ పాదయాత్రలో వారు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం-అరాచకవాదాన్ని అంతం చేద్దాం'(లోక్‌తంత్ర బచావో-అరాచకత హఠావో) అనే నినాదంతో నిర్వహించిన ఈ పాదయాత్ర మధ్యాహ్నం 3 గంటలకు బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ప్రారంభమై మోజంజాహీ మార్కెట్ వరకు కొనసాగింది. పాదయాత్ర ముగిసిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా పాల్గొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు, ప్రచారాన్ని తిప్పికొట్టడం ప్రధాన లక్ష్యంగా బీజేపీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఓటర్ల జాబితా ప్రక్షాళన ఆవశ్యకతను ప్రజలకు వివరించడమే పాదయాత్ర ఉద్దేశమని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పాదయాత్రకు ముందు అమిత్ షా చార్మినార్ సమీపంలోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమిత్ షా మహా పాదయాత్రకు ఓల్డ్ బోయినపల్లి నుంచి భారీగా తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

ఏనుగుల తిరుపతి అధ్వర్యంలో కార్యకర్తలు, నాయకుల ఉత్సాహభరిత భాగస్వామ్యం



బోయిన్ పల్లి, నవంబర్ 02 (ప్రజా జ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేపట్టిన మహా పాదయాత్ర కార్యక్రమానికి ఓల్డ్ బోయినపల్లి డివిజన్ నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగుల తిరుపతి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొనేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు పార్టీ జెండాలతో ఉత్సాహంగా తరలివెళ్లి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.పార్టీ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఓల్డ్ బోయినపల్లి డివిజన్ నుంచి బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



యాలాల రైతులకు దిక్కెవరు?బి శ్రీశైల్ రెడ్డి పంజుగుల





యాలాల్ నవంబర్ 2 ప్రజా జ్యోతి కరువు ప్రకటించి చేతులు దులుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం..కరువు తెచ్చిన ఐరన్ లెగ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వ్యాపారాల్లో బిజీ బిజీ ఎండిన పంటలు.. కన్నీటిలో రైతులు.. అయినా కదలని ప్రభుత్వం యాలాల: యాలాలను కరువు మండలంగా ప్రకటించినా రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదని, పంటలు ఎండిపోయి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తాండూర్ నియోజకవర్గ బీఆరెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల మండిపడ్డారు. సోమవారం యాలాల మండలంలో ఆయన పర్యటించి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. పంటలు చేతికొచ్చే సమయంలో నీళ్లు లేక ఎండిపోవడం, పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వరి, కంది, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. నీళ్లు లేక వేసిన పంటలన్నీ ఎండిపోయి పశువులకు మేతగా మారాయని, రైతులు తీవ్రంగా నష్టపోయి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాలాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కరువు ప్రకటించి చేతులు దులుపుకుంటే సరిపోదని, రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, పార్టీలతో సంబంధం లేకుండా నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.జాతీయ పార్టీలు అని చెప్పుకునే బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా రైతుల కష్టాలు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే కరువు పరిస్థితులు నెలకొనడం ఆయన పాలనకు నిదర్శనమని, తెలంగాణ చరిత్రలో రైతులకు కరువు తెచ్చిన ఐరన్ లెగ్ ముఖ్యమంత్రిగా తెలంగాణ చరిత్రలో మిగిలిపోతారని విమర్శించారు.తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఆయన సోదరుడు తమ వ్యాపారాలు, దందాలు, చీకటి సామ్రాజ్యాలు, వనరుల దోపిడీపైనే దృష్టి పెడుతున్నారని, నియోజకవర్గ ప్రజల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర వీడి రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మరో రెండేళ్లలో బీఆరెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు 24 గంటల కరెంట్, పుష్కలంగా సాగునీరు అందించి తెలంగాణ వ్యవసాయానికి మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, బీఆరెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడుతుందని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో యాలాల్ ముఖ్య నాయకులు మాజీ జెడ్పిటిసి సిద్రాల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, ఆశన్న, కృష్ణ, రాజు చెన్నారం శివకుమార్ కిషన్ రావు మంత్రి వెంకటయ్య కృష్ణపాటు పలువురు బీఆరెస్ పార్టీ ముఖ్య మరియు సీనియర్ నాయకులు పాల్గొన్నారు..

ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజావాణి'లో 17 దరఖాస్తుల స్వీకరణ

అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి 10 ఫిర్యాదులు



ఉప్పల్ నవంబర్ 02, ప్రజాజ్యోతి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపించేందుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం మొత్తం 17 దరఖాస్తులు స్వీకరించారు.

వివిధ విభాగాలకు సంబంధించి అందిన దరఖాస్తుల వివరాలు:

టౌన్ ప్లానింగ్ 10

ఇంజినీరింగ్ 04

ల్యాండ్ అక్విజిషన్ 01

ట్రేడ్ లైసెన్స్ 01

ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ 01

మొత్తంగా 17 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తూ, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగవంతమైన సేవలకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రాధాన్యతనిస్తోంది.

ఉద్యమకారుల సంక్షేమ హామీల అమలుకు అల్వాల్‌లో నిరసన గళం

47వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు




అల్వాల్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి) తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 47వ రోజుకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసి, ఉద్యమంలో ముందుండి పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి, వారికి తగిన గౌరవం కల్పించాలని దీక్షా శిబిరం వేదికగా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం వెంటనే ఖరారు చేయాలని కోరారు. ఉద్యమంలో పాల్గొన్న అర్హులైన ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు, వారికి వర్తించే సంక్షేమ పథకాలను అందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన సేవలు, త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలని పేర్కొన్నారు. 47వ రోజు రిలే నిరాహార దీక్షలో భాగంగా నరసింహ, జనార్దన్ రావు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో పటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, డోలి సుధీర్, అనంతుల సంతోష్, ముత్యాలు, మల్లేష్, శ్రీనివాస్ గౌడ్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

ఐక్యతకు ప్రతీక.. పటేల్ జీవితం స్ఫూర్తిదాయకం!

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా కాంచన లత

జీడీసీ చేవెళ్లలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి వేడుకలు



చేవెళ్ల, నవంబర్ 02 (ప్రజా జ్యోతి): దేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. కాంచనలత అన్నారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఐక్యత, క్రమశిక్షణ, దేశభక్తి భావాలను అలవరచుకోవాలని సూచించారు. ఆర్థికశాస్త్ర అధ్యాపకులు డా. ఎం.ఏ. మాలిక్ దేశ నిర్మాణంలో పటేల్ పాత్రను వివరించగా, చరిత్ర అధ్యాపకులు జె. మహేందర్ గౌడ్ సంస్థానాల విలీనం, ఆయన నాయకత్వ లక్షణాలను వివరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎ. కవిత, డా. ఎన్. విజయలక్ష్మి, కుమారి అఖిల, విద్యార్థులు పాల్గొన్నారు.

రావులపల్లిలో ఐసీఏఆర్ 'ఖేత్ బచావో అభియాన్'

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్





చేవెళ్ల నవంబర్ 02(ప్రజా జ్యోతి): భూసారాన్ని కాపాడుకుంటూ శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తేనే రైతులకు అధిక దిగుబడులు, మంచి ఆదాయం లభిస్తాయని రావులపల్లి కుర్ద్ సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్ అన్నారు. రైతులు నేల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. చేవెళ్ల మండలం రావులపల్లి కుర్ద్‌లో సోమవారం ఐసీఏఆర్--భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్), హైదరాబాద్ ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. నేల సారాన్ని పెంపొందించడంలో ప్రధాన, సూక్ష్మ పోషకాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జ్యోతి బద్రి ఐఐఆర్ఆర్ అభివృద్ధి చేసిన వివిధ వరి వంగడాలు, అధిక పోషక విలువలున్న బయోఫోర్టిఫైడ్ వరి రకాల గురించి వివరించారు. డాక్టర్ ఆర్. గోబినాథ్ భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాపిడ్ సాయిల్ టెస్టింగ్ కిట్ ద్వారా పొలంలోనే పరీక్షలు నిర్వహించే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. డాక్టర్ జాగృతి రోహిత్ 'ఖేత్ బచావో అభియాన్' లక్ష్యాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు), సమూహ ఆధారిత వ్యవసాయ విస్తరణ సేవల గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు సాయిల్ టెస్టింగ్ కిట్ వినియోగంపై శిక్షణ ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 48 మంది రైతులు, వీరిలో 38 మంది పురుషులు 13 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజన్ కుమార్ అనూష, చేవెళ్ల వ్యవసాయ అధికారి శంకర్ లాల్, వ్యవసాయ విస్తరణ అధికారులు బాల కోటేశ్వరరావు, గాయత్రి పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకోవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు , ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్ నవంబర్ 2(ప్రజా జ్యోతి) శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత నాయకులతో చందానగర్ మరియు మక్తా-మియాపూర్ డివిజన్ల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి నియోజకవర్గ శాసన సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు , మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించి, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గత పట్ట భద్రుల ఓట్ల జాబితా ఆధారంగా పూర్తి వివరాలు సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో ఓటర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నాయకులు అభిమానులు కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.మన ఇళ్లలోని పట్టభద్రులతోపాటు కాలనీ, డివిజన్ తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదు చేపించాలి.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుంచి ప్రారంభమవ్వాలి.గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు కూడా తిరిగి ఓటర్ నమోదును చేపించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి.రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి 70 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్నికలెప్పుడు వస్తాయి, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి ఎప్పుడూ చేస్తామని ప్రజలు ఎదురుచూస్తున్నారు.కానీ నేడు ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి కృషిచేయాలన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో మంచి మెజారిటీ సాధించేలా నాయకులు, కార్యకర్తలకు కృషి చేయాలి.ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అమిత్ షా మహా పాదయాత్రకు బీజేపీ నాయకులు, ఓబీసీ నేతల భారీ తరలింపు

ఉత్సాహంగా పాల్గొన్న జెకె శేఖర్ యాదవ్ తదితరులు



కుత్బుల్లాపూర్ నవంబర్ 2(ప్రజా జ్యోతి) హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మహా పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్న.. జెకె శేఖర్ యాదవ్ -- మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు. సిద్ధిరాం రెడ్డి -- బీజేపీ సీనియర్ నాయకుడు.. గండి రాజు యాదవ్ -- మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి... బీజేపీ నాయకులు జగన్ ముదిరాజ్ -- కె. బిక్షపతి . కృష్ణ యాదవ్, కుమార్ యాదవ్ తదితర నాయకులు. మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ నాయకులు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజావాణి ని నిర్వహించాలని సిపిఐ మరియు జనసేన నాయకులు ధర్నా

కుత్బుల్లాపూర్ నవంబర్ 2(ప్రజా జ్యోతి) ప్రతి సోమవారం నాడు కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే ప్రజావాణికి దూరప్రాంతాల నుండి ప్రజలు వెళ్లవలసి రావడం వల్ల వారికి ఇబ్బంది కలగకుండా స్థానిక రెవెన్యూ అధికారి కార్యాలయంలోని ప్రజావాణి నిర్వహించాలని గత మూడు నెలల క్రితం జీవో జారీ చేసినప్పటికీ కు రెవెన్యూ కార్యాలయంలో అధికారికంగా ప్రజావాణి నిర్వహించకపోవడం వల్ల నేడు సిపిఐ మరియు జనసేన పార్టీలో ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గత వారం మరియు గత నెల క్రితం కూడా ప్రజావాణి నిర్వహించాలని వినితిపత్రం ఇచ్చినప్పటికీ స్పందించకపోవడం వల్లే నేడు ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాల్సి వచ్చిందని, ప్రజావాణి ఉండడం వల్ల ప్రజల తమ సమస్యలను నేరుగా అధికారులను కలిసి ఇచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి ఎంతో కొంత ఆ సమస్య పరిష్కారం అవుతుందని ఆశతో ప్రజలు ఉంటారని కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రజావాణి కార్యక్రమం అనుకున్నంత మేరకు విజయం సాధించలేకపోతుందని దానికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి అన్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల పైన హైకోర్టు తీర్పునిచ్చి నెలలు గడిచినప్పటికీ నేటికీ చర్యలు తీసుకోకపోవడం అదేవిధంగా జగద్గిరిగుట్ట మరియు గాజులరామారంలో అనేక భూకబ్జాలను కొనసాగుతున్నాయని వాటన్నిటిని పరిష్కరించాల్సిందిగా డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో బైరెడ్డి రాజేష్ వినతి పత్రం ఇచ్చి కచ్చితంగా ప్రజావాణి నిర్వహించాలని డిమాండ్ చేయగా వారు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ జనసేన అధికార ప్రతినిధి నల్లగిరి సతీష్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మీ శ్రీనివాస్ సిపిఐ నాయకులు కే వెంకటేష్



సదానంద, సహదేవరెడ్డి శ్రీనివాస్ చారి, మల్లేష్, ఇమామ్ యువజన సంఘం నాయకులు కీర్తి ,ప్రవీణ్, నరసింహ, జనసేన నాయకులు దుర్గాప్రసాద్,నవీన్,మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్ ప్రతాప్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన శ్రీశైల్ రెడ్డి



తాండూరు నవంబర్ 2 ప్రజా జ్యోతి:- తాండూర్ మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు బండి ప్రతాప్ రెడ్డి సతీమణి గతేడాది క్రితం మృతి చెందింది. దీంతో సోమవారం ప్రతాప్ రెడ్డి నివాసంలో ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇట్టి కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ తాండూర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తాండూరు మండల మాజీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, రామలింగారెడ్డి, వెంకట్ రెడ్డి, ఇంతియాజ్ పటేల్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మీ వెంటే ఉంటా...! బాలయ్య నగర్ ను మరింత అభివృద్ధి చేస్తా...

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద

ప్రజా బంధువుకు "బాలయ్య నగర్" బస్తీ వాసుల ఘన స్వాగతం...!

జై బిఆర్ఎస్...జైజై వివేకన్న నినాదాలతో మార్మోగిన బాలయ్య నగర్

కుత్బుల్లాపూర్ నవంబర్ 2(ప్రజా జ్యోతి) మౌలిక వసతుల కల్పననే లక్ష్యంగా 125 – గాజుల రామారం డివిజన్ బాలయ్య నగర్ లో దాదాపు 47.50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిరుపేదలు అధికంగా నివసించే బాలయ్య నగర్ బస్తీ నిలబెట్టేందుకు బస్తీ వ్యవస్థాపకులు ఎల్లయ్య చేసిన త్యాగం మరువలేనిదని, బాలయ్య నగర్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా గత పన్నండేళ్ళ కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్లు, వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో కూడా మౌలిక వసతుల కల్పనతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణము, బతుకమ్మ ఘాట్, ఛత్ పూజ గాట్లను నిర్మించేందుకు మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ.నాగేష్ ఉపాధ్యక్షులు సిఎస్ఐ, ప్రధాన కార్యదర్శి ఈ.పార్వతి శ్యాంసుందర్, గంగయ్య, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హాస్పటల్లో పనిచేసిన మహిళ కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనం ఇప్పించిన

బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



కూకట్ పల్లి నవంబర్ 2(సాక్ష్యం) కూకట్ పల్లి నియోజకవర్గం లోని హౌసింగ్ బోర్డ్ లో విశిష్ట హాస్పిటల్ లో గత ఏడు నెలలుగా పని చేసిన వేతనం కోసం మహిళా కార్మికులు ఎంతో ఇబ్బందులు పడ్డారు విశిష్ట హాస్పటల్ యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తూ మహిళా కార్మికులకు రావాల్సిన పెండింగ్ లో ఉన్న వేతనం నాలుగు 4,లక్షల 19000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో ఎవరైతే మనకు కార్మికుల పట్ల న్యాయం జరుగుతుందని తెలుసుకొని తోటి కార్మిక మిత్రుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని, అతని కార్యాలయం వద్దకు వెళ్లి ఆ మహిళ కార్మికులకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.. వెంటనే స్పందించిన రవి విశిష్ట హాస్పటల్ యజమాన్యం తో మాట్లాడి మహిళా కార్మికులు మొత్తం ఒక్కొక్కరికి రావాల్సిన వేతనం, జితేంద్ర ప్రసాద్ 60,000, వీరస్వామి 90,000, సాకేత్ 13000, శ్రావ్య 17000, సమత 15000, మనుష 8000, సుకన్య 40,000, నాగరాణి 55000, రేవతి 16000, జ్యోతి 18000, భాగ్యలక్ష్మి 17000, ఝాన్సీ 70,000, వేల రూపాయలు మొత్తం 4 లక్షల19000/- వేల రూపాయలు మొత్తం 12 మంది మహిళ కార్మికులకు చెక్కు రూపంలో అందజేయడం జరిగింది... మహిళా కార్మికులు మాట్లాడుతూ కార్మికుల కష్టజీతం ఇప్పించడంతో సహాయం చేసిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు...

యువత డ్రగ్స్ తో ఉజ్వల భవిష్యత్తు కోల్పోవద్దు..

ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్ స్పెక్టర్ మహేందర్ రెడ్డి

డ్రగ్స్ అవినీతి లపై విద్యార్థులకు అవగాహన సదస్సు

ఇబ్రహీంపట్నం నవంబర్ 2 ప్రజాజ్యోతి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాలన శాస్త్రం వాణిజ్య శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు, అవినీతి వల్ల కలిగే నష్టాల గురించి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రాధిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన, ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్ స్పెక్టర్ మహేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... డ్రగ్స్ వాడకం వల్ల కేవలం ఒక వ్యక్తి శారీరక ఆరోగ్యానికి కాకుండా మానసిక ఆరోగ్యానికి తద్వారా ఉద్యోగము కుటుంబ జీవితం, భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు విద్యార్థులు డ్రగ్స్ వాడినట్లయితే వారి జ్ఞాపకశక్తి ఏకాగ్రత తగ్గి నేర ప్రవృత్తి పెరుగుతుందని, డబ్బులు అవసరమైనప్పుడు దొంగతనాలు, నేరాలు చేయడానికి కూడా వెనకాడరని అన్నారు. దానికి ఉదాహరణ పోలీస్ స్టేషన్లో పెరుగుతున్న కేసులేని అని అన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కుటుంబ వ్యవస్థ దెబ్బతిని ఆర్థిక సమస్యలు, అప్పులు పెరుగుతాయని, సామాజిక వ్యవస్థ చిన్న భిన్నం అవుతుందని ఇది దేశ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కావున డిగ్రీ కళాశాల విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని, అటువంటి కార్యక్రమాలు కార్యకలాపాలు జరిగినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు అదేవిధంగా విద్యార్థులు అవినీతికి దూరంగా ఉండాలని, అవినీతిని ప్రశ్నించాలని సూచించారు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక మాట్లాడుతూ... యువత దేశానికి ముఖ్యమైన మానవ వనరు అని వారు విద్య, విజ్ఞానం, పరిశోధన, పరిశ్రమలు, పరిపాలన వంటి రంగాల్లో అభివృద్ధి సాధించాలి కానీ మత్తు పదార్థాలకు బానిసలైతే వారి ప్రతిభ, ఉత్పాదకత తగ్గి దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నష్టం కలుగుతుంది అని అన్నారు. కావున విద్యార్థులు మత్తు పానీయాలకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా దేశ సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధికి అవినీతి అనేది అడ్డంకిగా మారిందని, విద్యార్థులు అందరూ అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడి అవినీతి చర్యలకు పాల్పడకుండా ఉండాలని, లంచం ఇవ్వడాన్ని తీసుకోవడాన్ని పూర్తిగా వ్యతిరేకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలన విభాగాధిపతి జి. రవికుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. సురేష్, ఇబ్రహీంపట్నం పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్ సుమలత, అధ్యాపకులు డి ఎస్ ఆర్ కృష్ణ, సురేష్, డాక్టర్ సిహెచ్ రాకేష్ భవాని, డాక్టర్ డి.వి. రావు, డాక్టర్ నరసింగరావు, టి, శ్రీ కృష్ణ, డాక్టర్ ఈ. శంకర్ తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.





88 ఏళ్ల వయసులోనూ సైకిల్‌పై బట్టల వ్యాపారం.. వృద్ధుడి కష్టాన్ని చూసి ఆశ్చర్యపోయిన యువత



కుత్బుల్లాపూర్ నవంబర్ 2(ప్రజా జ్యోతి) డి.లక్ష్మణరావు 88 ఏళ్ల కుత్బుల్లాపూర్ జోన్ సూరారం డివిజన్, సిఎంసి, మేడ్చల్ జిల్లా, రాజీవ్ గాంధీ నగర డి.లక్ష్మణరావు వయస్సు 88 ఏళ్ల సైకిల్ మీద తిరుగుతూ బట్టలు అమ్ముకొని జీవిస్తూ రాజీవ్ గాంధీ నగర్ లో అద్దె ఇంట్లో కాలం గడుపుతున్నాడు తాను తన భార్యతో ఇది చూసిన ప్రజలు యువకులు ఆశ్చర్యపోయారు ఆ తాత ముందర మేము దేనికి పనికిరాని గుసగుసలాడుకున్నారు

ఓట్ బచావో...దేశ్ బచావో సభలో సత్తా చాటిన తెలంగాణ కాంగ్రెస్

ఢిల్లీ సభ విజయవంతంపై కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హర్షం

తలకొండపల్లి,నవంబర్ 02 (ప్రజా జ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ,ఓటు హక్కులను కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'ఓట్ బచావ్..దేశ్ బచావో' భారీ బహిరంగ సభలో తెలంగాణ కాంగ్రెస్ తన ఐక్యతను,సంస్థాగత బలాన్ని చాటుకుందని సోమవారం కు ప్రకటనలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మార్గదర్శకత్వంలో,ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ,లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించిన ఈ సభకు దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో,టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణ నుంచి 15 వేల మందికి పైగా కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్లి సభను విజయవంతం చేశారన్నారు.అడ్డంకులను అధిగమించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రత్యేక రైళ్లకు చివరి నిమిషంలో అనుమతి నిరాకరించినా,100 కి పైగా బస్సులు,కార్లు,విమానాల ద్వారా ఢిల్లీకి చేరుకోవడం కార్యకర్తల అంకితభావానికి నిదర్శనమని అన్నారు.800 హోటల్ గదులు,భోజన,వసతి,వైద్య సదుపాయాలు పీసీసీ పకడ్బందీగా ఏర్పాటు చేసిందన్నారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో కొనసాగుతున్న ఓటు హక్కుల పరిరక్షణ పోరాటానికి తెలంగాణ కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.



దూలపల్లిలో వీధి దీపాల ఏర్పాటు చేయాలని వినతి

ప్రధాన రహదారితో పాటు కాలనీల్లో వెలుగుల సమస్య పరిష్కరించాలని డిమాండ్



కొంపల్లి, నవంబర్ 2, ప్రజా జ్యోతి దూలపల్లి డివిజన్ పరిధిలో వీధి దీపాల సమస్యను పరిష్కరించి ప్రజలకు మెరుగైన విద్యుత్ వెలుగుల సదుపాయం కల్పించాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ నాయకులు కొంపల్లి మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.దూలపల్లి ప్రధాన రహదారితో పాటు గంగస్థాన్ ప్రాంతంలో వీధి దీపాల సమస్య ఉందని, రాత్రి వేళల్లో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా 289వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటు, మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

బ్రహ్మకుమారీస్ దీపావళి స్నేహ సమ్మేళనం విజయవంతం



హైదరాబాద్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి) : చేలాపుర్ బ్రహ్మకుమారీస్ శాఖ ఆధ్వర్యంలో శాలిబండలోని భారత్ గుణవర్ధక సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించిన దీపావళి స్నేహ సమ్మేళనం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆశలు నింపాలని ఆకాంక్షించారు. చేలాపుర్ శాఖ నిర్వాహకురాలు రజనీ సోదరి ఆత్మజ్యోతిని వెలిగించుకుని పరమాత్మ స్మృతిలో జీవించడమే దీపావళి అసలైన ఆనందమని తెలిపారు. హిమాయత్‌నగర్ శాఖ నిర్వాహకుడు బ్రదర్ ఆనంద్ రాజయోగ ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. రజనీ, శిరీష, శక్తి, ప్రశాంత, సవిత సోదరీమణులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాతబస్తీలోని వివిధ బ్రహ్మకుమారీస్ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

పామేనాలో పవర్ కష్టాలు!

గంటలో 20 సార్లు కరెంట్ కట్.. జనం విలవిల

పదేపదే విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు

టీవీలు, ఫ్యాన్లు దెబ్బతింటున్నాయని ఆవేదన

చేవెళ్ల నవంబర్ 02(ప్రజా జ్యోతి):చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పామేనా వార్డులో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఎప్పుడు కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గంట వ్యవధిలోనే సుమారు 20 సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, తిరిగి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్.. ఆఫ్‌తో అవస్థలు

పదేపదే విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండటంతో ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు తదితర విద్యుత్ పరికరాలు దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. కరెంటు ఎప్పుడు నిలిచిపోతుందో తెలియక గృహ అవసరాలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని చెబుతున్నారు. గంటలోనే పదుల సంఖ్యలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, పునరుద్ధరణ కావడం తమకు తలనొప్పిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

పామేనా వార్డులో విద్యుత్ సరఫరా సమస్యను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. లైన్‌మెన్, ఏఈలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తరచూ విద్యుత్ అంతరాయాలకు కారణాలను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ లేబర్ సెల్ సోషల్ మీడియా జిల్లా కమిటీ నియామకాలు



ఎల్బీనగర్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి) భారతీయ జనతా పార్టీ కార్మిక విభాగం లేబర్ సెల్ విస్తరణలో భాగంగా సోషల్ మీడియా జిల్లా కమిటీకి నూతన నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అందే శ్రీనివాస్, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి పాలకుర్తి శేషగిరిరావు చేతుల మీదుగా జీవన్ ఆదిత్య, శివప్రసాద్, దినేష్‌లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వారు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని, పార్టీ అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. తమకు ఈ అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ లేబర్ సెల్ సభ్యులు ముఖముల అచ్యుతశర్మ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా పాదయాత్రకు బైరామల్‌గూడ బీజేపీ శ్రేణులు

ఎరుకల మల్లేష్ గౌడ్



ఎల్బీనగర్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి) కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాదయాత్రకు బైరామల్‌గూడ డివిజన్ హస్తినాపురం నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై నినాదాలు చేస్తూ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు ఆపన్నహస్తం...ఆర్థిక సాయం అందించిన ఉప్పల వెంకటేష్



తలకొండపల్లి,నవంబర్ 02 (ప్రజాజ్యోతి) రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వీరన్నపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి నూనె నరేష్ యాదవ్ (తండ్రి స్వామి) హైదరాబాద్ లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నాడు.తండ్రి వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుండగా,విద్యా సంవత్సరం మధ్యలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఫీజు చెల్లించలేని దుస్థితి ఏర్పడింది.దీంతో విద్యార్థి చదువు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి నెలకొంది.ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మానవతా దృక్పథంతో వెంటనే స్పందించారు.విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణ సహాయంగా రూ.15,000 ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు.చదువు విషయంలో ఎటువంటి ఇబ్బంది ఉన్నా తనను సంప్రదించాలని,పేద విద్యార్థుల చదువులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ హామీ ఇచ్చారు.విద్యార్థి ఉన్నత చదువులు చదివి గ్రామానికి,మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఉప్పల వెంకటేష్ చేసిన సహాయానికి విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.గతంలో కూడా ఎంతో మంది పేదలకు,విద్యార్థులకు ఉప్పల వెంకటేష్ అండగా నిలిచారని స్థానికులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ సైన్యం బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వరికుప్పల గణేష్,వీరన్నపల్లి గ్రామ సీనియర్ నాయకులు రాఘవేందర్,కాశన్న,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్ లో అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

తలకొండపల్లి,నవంబర్ 02 (ప్రజాజ్యోతి):



తలకొండపల్లి మండల పరిధిలో గల చుక్కాపూర్ గ్రామంలోని 9వ వార్డులో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు గ్రామ నాయకులతో కలిసి సర్పంచ్ మాకం వీరేశలింగం సోమవారం శంకుస్థాపన చేశారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరు అయ్యాయి.గ్రామంలోని 9వ వార్డులో గత పదేళ్లుగా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారేది.దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోయేవారు.ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి ప్రత్యేక నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్య మాట్లాడుతూ...గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎల్లప్పుడూ అండగా ఉంటారని,త్వరలోనే సీసీ రోడ్లు,ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు.తమ చిరకాల సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.8వ వార్డు సభ్యులు కాడిగే లావణ్య–చంద్రకుమార్ ఆధ్వర్యంలో సోమవారం పనులు ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకం వీరేశలింగం,ఏఎంసీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్య,ఉపసర్పంచ్ లక్నమోని లావణ్యశ్రీను,మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు,గ్రామ పెద్దలు ఏమిరెడ్డి రంగారెడ్డి,జక్కు శ్రీనివాస్ రెడ్డి,నరసింహ,రామచంద్రయ్య,రాకేష్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత



తలకొండపల్లి,నవంబర్ 02 (ప్రజాజ్యోతి) రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని మెదక్ పల్లి గ్రామానికి చెందిన నిరుపేద శానమోని మహేష్ రాజ్ ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చేయూతను అందించారు.సొంత ఇల్లు నిర్మించుకోవాలన్న చిరకాల కోరికతో ఇటీవలే ఇంటి పనులు ప్రారంభించాడు.అయితే చేతిలో డబ్బులు లేక,సిమెంట్ కొనలేక పనులు మధ్యలోనే ఆగిపోయాయి.దీంతో ఏం చేయాలో తెలియక ఆ కుటుంబం అందోళన చెందుతోంది.స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్,తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించారు.తమ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ను అందించి మానవత్వం చాటుకున్నారు.తన వంతు సాయంగా ముందుకు వచ్చి పేద కుటుంబానికి అండగా నిలిచారు.తమ ఇంటి నిర్మాణానికి సహకరించిన ఉప్పల వెంకటేష్ కు శానమోని మహేష్ రాజ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నిత్యం కల్వకుర్తి నియోజకవర్గంలో ఎంతో మంది పేదలకు,విద్యార్థులకు,ఆలయాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విశేష సేవలు అందించారని,పేదల పెన్నిధిగా నిలుస్తున్నారని గ్రామస్తులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నరేష్ రాజ్,వార్డు సభ్యులు దరువుల రజనీకాంత్,బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షులు మార్చమల్లయ్య,బీఆర్ఎస్ యువ నాయకులు బాలు,సతీష్,శానమోని నాని తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా మహా పాదయాత్రలో పాల్గొన్న కొంపల్లి బీజేపీ నాయకులు

కొంపల్లి నుంచి సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తల తరలింపు



కొంపల్లి, నవంబర్ 2 ప్రజా జ్యోతి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేడు భాగ్యనగరంలో నిర్వహించిన మహా పాదయాత్రలో కొంపల్లి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకాన్ని అంతం చేద్దాం అనే నినాదంతో చేపట్టిన ఈ పాదయాత్రకు మద్దతుగా స్థానిక బీజేపీ అధ్యక్షుడు సతీష్ సాగర్, జిల్లా నాయకుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో కొంపల్లి నుంచి సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పాదయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సరితారావు, జనార్దన్ రెడ్డి, శంకర్ నాయక్, మధు, మహేందర్ సాగర్, లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐపోస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా సుంకరి చంద్రశేఖర్ గౌడ్

శాంతి,సోదరభావం పెంపొందించేందుకు కృషి చేస్తా: చంద్రశేఖర్ గౌడ్



అబ్దుల్లాపూర్ మెట్టు/ నవంబర్ 02 (ప్రజాజ్యోతి) అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐపోస్) రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా సుంకరి చంద్రశేఖర్ గౌడ్ నియమితులయ్యారు. ఆదివారం ఎన్‌టీఆర్ నగర్ మార్కెట్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన సంఘం రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలో ఆయన నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో, పరస్పర సహకారంతో శాంతియుత మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, రాష్ట్ర నాయకులు పల్లె వినయ్ కుమార్‌తో పాటు జిల్లా ప్రతినిధులకు చంద్రశేఖర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తలకొండపల్లిలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలపై అవగాహన



తలకొండపల్లి,నవంబర్ 02 (ప్రజాజ్యోతి) తలకొండపల్లి మండల కేంద్రంలో దివ్యాంగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన,శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.కేశంపేట మరియు తలకొండపల్లి మండలాలకు చెందిన దివ్యాంగులకు ఉపాధి,స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా,సమాజంలో ఆర్థికంగా నిలదొక్కుకునేలా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా తలకొండపల్లి ఏపీఎం రామస్వామి,డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మేనేజర్ వెంకటేశ్వర్,నవీన్ లు మాట్లాడుతూ...దివ్యాంగులకు తగిన నైపుణ్య శిక్షణ ఇచ్చి వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని,స్వయం ఉపాధి పొందేందుకు చేయూతనందిస్తామని హామీ ఇచ్చారు.అర్హులైన వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే బాధ్యత ఫౌండేషన్ తీసుకుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య కోశాధికారి సరిత,సీసీలు దీప, విజయలక్ష్మి, రాములు,ఐకేపీ సిబ్బంది, దివ్యాంగులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ కుట్రలను భగ్నం చేస్తాం

ప్రజాస్వామ్య పరిరక్షణకోసం చేపట్టిన మహా పాదయాత్రలో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి

అశేషంగా తరలి వచ్చిన ప్రజానీకం

కాషాయమమైన నగర వీధులు, కాలనీలు

పాదయాత్రకు తరలొచ్చిన ప్రజలకు, కార్యకర్తలకు ధన్యవాదాలు చేప్పిన కీర్తిరెడ్డి.



ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ కుట్రలను ప్రజలు తిప్పికొడతారని ఆమె స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌నిజాం కాలేజీ వద్ద కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ మహా పాదయాత్రలో పార్టీ శ్రేణులతో కలిసి ఆమె పాల్గొన్నారు.

యాత్ర సాగిందిలా...

నిజాం కాలేజీలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి మొజాంజాహీ మార్కెట్ ఎక్స్ రోడ్స్ వరకు సాగిన ఈ పాదయాత్రకు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజలు, బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో నగరం కాషాయమయంగా మారింది.

అంబర్‌పేట్ నుంచి అశేషంఆ తరలివచ్చిన జనం

జూటూరు కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 8 డివిజన్ల నుంచి సుమారు 1,500 మంది ప్రజలు, పార్టీ శ్రేణులు ప్రత్యేక బస్సుల్లో మహా పాదయాత్రకు తరలివచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమిత్ షా గారి పాదయాత్రకు అంబర్ పేట్ అసెంబ్లీ పరిధిలోని 8 డివిజన్ల నుంచి తరలివచ్చి ప్రతి ఒక్క కార్యకర్తలకు ప్రజలకు పేరు పేరున ధన్యవాదాలు చెప్పారు కీర్తిరెడ్డి

మీకు ఓట్ చోరీపై మాట్లాడే హక్కులేదు

మహా పాదయాత్రలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నడిచిన కీర్తిరెడ్డి కాంగ్రెస్ పార్టీ వ్యవహారశైలిపై తనదైనశైలిలో మండిపడ్డారు. ఓట్ చోరీ గురించి మాట్లాడే ముందు కాంగ్రెస్ తన చరిత్రను గుర్తు చేసుకోవాలన్నకీర్తిరెడ్డి.. ప్రధానిగా నెహ్రూఎన్నిక జరిగింది ఓట్ చోరీతో కాదా అని ప్రశ్నించిన ఆమె.. ఇప్పుడు అదే పార్టీ ప్రజాస్వామ్యంపై మాట్లాడటం దొంగే దొంగ అని అరిచినట్లుంది సెటైర్ వేశారు. అంతేకాదు స్వార్థ రాజకీయాల కోసం ఇందిరా గాంధీ రాజ్యాంగాన్ని కూనీ చేసి, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ దేశంలో ఎమర్జెన్సీ విధించిన చరిత్ర మరచిపోవద్దన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు ముందుగా తమ గతాన్ని సమీక్షించుకోవాలని చురకలంటించారామె.

ఎందుకు భయపడుతున్నారు?

ఓటర్ల జాబితా ప్రక్షాళనపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఎందుకు ఆందోళన చెందుతున్నారు? అని ప్రశ్నించారు కీర్తిరెడ్డి... మీ అక్రమ ఓట్లు తొలగిపోతాయనే భయమా? అని నిలదీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలి. అనర్హమైన, నకిలీ ఓట్లను తొలగించాల్సిన అవసరం లేదా? ఎన్నికల సంఘం చేపడుతున్న ూ×= ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి నష్టం కలిగించడమే. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండటం కాంగ్రెస్‌కు ఎందుకు ఇష్టం లేదు? తెలంగాణ కాంగ్రెస్ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ఢిల్లీ డ్రామాలా?

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు కీర్తిరెడ్డి. ఓ పక్క ఎల్ నినో ప్రభావంతో ఇక్కడి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. పట్టించుకోకుండా లక్షలు ఖర్చు చేస్తూ ఢిల్లీకి తరలి వెళ్లడం ఏమిటని ప్రశ్నించారామె.

లక్షల రూపాయలు ఖర్చు చేసి ఢిల్లీకి వెళ్లే బదులు అవే డబ్బులు ఇక్కడి ప్రజల తాగు, సాగునీటి కష్టాలు తీర్చే ఆలోచన చేయాలని సలహా ఇచ్చారామె.

సిగ్గుపడాలి..?

ఓటుకు నోటు కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న నేతలు కూడా ఓట్ చోరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు కీర్తిరెడ్డి. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల సమయంలో రాజకీయాలు చేయడం కాదు.. ప్రజల హక్కులను కాపాడటం, రాజ్యాంగ విలువలను గౌరవించడమేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ తన రాజకీయ స్వార్థం కోసం ప్రజాస్వామ్యాన్ని వాడుకోవాలని చూస్తే.. బీజేపీ ప్రజల పక్షాన నిలబడి ఆ కుట్రలను భగ్నం చేస్తుందని స్పష్టం చేశారామె.

బాధిత జర్నలిస్ట్ కుటుంబానికి తలకొండపల్లి జర్నలిస్ట్ సంఘం నేతల పరామర్శ



తలకొండపల్లి,నవంబర్ 02 (ప్రజాజ్యోతి): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన తెలంగాణ శబ్దం యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ కరుణాకర్ తండ్రి బురిగల్ల నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారని,ఈ నెల 25న తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు.సోమవారం వారి స్వగృహం వద్ద కుటుంబ సభ్యులు దశదినకర్మ కార్యక్రమం ఏర్పాటు చేశారు.విషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల జర్నలిస్టు మిత్రులు అందరూ కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.తోటి జర్నలిస్టు కరుణాకర్ ను ఓదార్చి,ధైర్యంగా ఉండాలని,కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం మృతుడు బురిగల్ల నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.జర్నలిస్టు వృత్తిలో ఒడిదుడుకులు ఎన్ని ఉన్నా,ఇలాంటి కష్ట సమయంలో ఒకరికొకరు అండగా నిలవడం గొప్ప విషయమని సీనియర్ జర్నలిస్టులు అన్నారు.భవిష్యత్తులో కూడా తోటి జర్నలిస్టులకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు తిరుపతయ్య,మహేష్,తూర్పు శీను,రాజు,విజయ్,గణేష్,బాలరాజు నాయకులు పడకల్ మాజీ ఎంపీటీసీ జోగు రమేష్,సిపిఎం కార్యదర్శి వెంకటయ్య,రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలని కబ్జాకు గురికాకుండా కాపాడాలి.

పాఠశాలను సందర్శించిన సీపీఐ నాయకులు

సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్



కుత్బుల్లాపూర్ నవంబర్ 2(ప్రజా జ్యోతి) నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంబందించిన స్థలం కొంత మంది కబ్జాదారులు అట్టి స్థలని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి అని,సీపీఐ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించడం జరిగింది. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రగతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీసీ,ఎస్సీ,ఎస్టీ బడుగు బలహీన వర్గాల పిల్లలు దాదాపు 556 మంది విద్యార్థులు చదువుతున్నారు అని అన్నారు. ఆ పాఠశాల ఆట స్థలం పై కొంత మంది కన్ను పడిందని దాదాపు ఎకరం పాఠశాల స్థలం కబ్జా చేసే ప్రయత్నంలో వున్నారని వారికీ సమాచారం వచ్చిందని అన్నారు. గబ్బిలపేట్ లోని ప్రభుత్వ పాఠశాల పై సీపీఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించడం జరిగింది అని గుర్తు చేశారు. పేద ప్రజలకు విద్య, వైద్యం ఉచితం చేస్తే సరిపోతుంది అని అన్నారు. అలాగే బాచుపల్లి మండల పరిధిలో ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడం అయిపోయింది అని , చెరువుల కబ్జాచేయడం అయిపొయింది అని , గుట్టలు, పుట్టలు కబ్జా చేయడం అయిపోయాయిఅని . ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల పై కబ్జాదారుల కన్ను పడింది అని అన్నారు. కనుక ప్రగతి నగర్ ఉన్నత పాఠశాల ఆట స్థలం కాపాడే బాధ్యత అందరి పై ఉంది. సీపీఐ గా మీము కలెక్టర్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి ప్రజా శ్రేయస్సు కోరే ప్రతి ఒక్కరిని కలుపుకొని పోరాటం నిర్వహిస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బాచుపల్లి మండల నాయకులు ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, కె. మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు నిత్య అన్నప్రసాద వితరణ.. సేవే లక్ష్యంగా శ్రీ ధర్మశాస్త్ర అన్నప్రసాద సేవా సమితి!

నాలుగేళ్లుగా నిరంతర అన్నదాన సేవ..

ప్రతిరోజూ సుమారు 500 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం

స్వాముల ఆరోగ్యమే ప్రాధాన్యం.. ప్రకృతి సిద్ధమైన ఇస్తరాకుల వినియోగానికి ప్రోత్సాహం


సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న గురుస్వాములు, సభ్యులు

అన్నదానం, నిత్యావసర సరుకులు, ఇస్తరాకుల విరాళాలకు దాతలు ముందుకు రావాలి

కుత్బుల్లాపూర్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి) అన్నదానం మహాదానం.. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా గొప్ప సేవ మరొకటి లేదనే సంకల్పంతో శ్రీ ధర్మశాస్త్ర అన్నప్రసాద సేవా సమితి విశేష సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బీరప్పనగర్‌లో ఉన్న బీరప్ప ఆలయ ప్రాంగణంలో గత నాలుగు సంవత్సరాలుగా నిరంతరంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ అయ్యప్ప స్వాముల ఆకలి తీరుస్తోంది.శ్రీ ధర్మశాస్త్ర అన్నప్రసాద సేవా సమితి (రిజిస్ట్రేషన్ నం. 823/2024) ఆధ్వర్యంలో ప్రతిరోజూ సుమారు 500 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజన సదుపాయాన్ని కల్పిస్తూ సేవాభావంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళున్నారు. నాలుగేళ్లుగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించడం సమితి సభ్యుల అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.కావడి కుటుంబం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు.. కావడి చంద్రారెడ్డి, సమితి అధ్యక్షులు కావడి గోపాల్ రెడ్డి (గురుస్వామి), కావడి జైపాల్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సమితి ఉపాధ్యక్షులు తమరాపు కృష్ణతో పాటు ధనుంజయ్ గురుస్వామి, సప్పిడి కృష్ణ, సుధాకర్ రెడ్డి, వడ్ల నాగరాజు, నవీన్ కుమార్, కృష్ణారెడ్డి, క్రాంతి, సురేష్ స్వామి, తదితరులు సేవా కార్యక్రమాల్లో తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తూ సమితికి సహకరిస్తున్నారు. అందరి సమిష్టి కృషితో అన్నప్రసాద వితరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. అన్నదాతల సహకారంతో నిరంతర అన్నదాన సేవ.. సోమవారం అన్నప్రసాద సేవకు అన్నదాతలుగా సత్తిబాబు స్వామి, శేఖర్ స్వామి, శంకర్ స్వామి ముందుకు వచ్చి తమవంతు సహకారం అందించారు. భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు దాతలు చూపుతున్న ఔదార్యం అభినందనీయమని సమితి సభ్యులు పేర్కొంటున్నారు. అన్నదాతల సహకారం వల్లే ఇంత పెద్ద సంఖ్యలో స్వాములకు ప్రతిరోజూ అన్నప్రసాదం అందించడం సాధ్యమవుతోందని తెలిపారు. స్వాముల ఆరోగ్యానికి ప్రాధాన్యం.. ప్రకృతి సిద్ధమైన ఇస్తరాకుల వినియోగానికి పిలుపు..అన్నప్రసాద వితరణలో స్వాముల ఆరోగ్యాన్ని, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రకృతి సిద్ధంగా తయారుచేసిన ఇస్తరాకులను వినియోగించేందుకు సమితి ఆసక్తి చూపుతోంది. ప్లాస్టిక్, ఇతర కృత్రిమ పదార్థాలతో తయారైన ప్లేట్లకు బదులుగా సహజసిద్ధమైన ఇస్తరాకులను అందించే దాతలు ముందుకు వచ్చి తమవంతు సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రతిరోజూ సుమారు 500 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం అందిస్తున్న నేపథ్యంలో ఇస్తరాకుల సరఫరాకు దాతలు సహకరిస్తే స్వాములకు భోజనం అందించడంతో పాటు పర్యావరణహితమైన విధానాన్ని ప్రోత్సహించిన వారవుతారని పేర్కొన్నారు. అన్నదానం, ఇస్తరాకుల విరాళం.. ఏ రూపంలో సహకరించినా అది స్వాముల సేవలో భాగస్వామ్యం కావడమేనని తెలిపారు.

దాతలు ముందుకు వస్తే మరింత మందికి అన్నప్రసాద సేవ..

అన్నదానం అనేది కేవలం ఆహారం అందించడం మాత్రమే కాదని, ఆకలితో ఉన్నవారికి ఆప్యాయతను పంచే పవిత్రమైన సేవ అని సమితి నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ మహత్తర కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగేందుకు భక్తులు, దాతలు, సేవాభిమానులు తమవంతు సహకారం అందించాలని



విజ్ఞప్తి చేస్తున్నారు. బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులు, ప్రకృతి సిద్ధమైన ఇస్తరాకులు లేదా ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఈ అన్నదాన యజ్ఞంలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.ఒక్కరోజు అన్నదానానికి సహకరించినా వందలాది మంది అయ్యప్ప స్వాములకు భోజనం అందించే మహద్భాగ్యం కలుగుతుందని, ప్రతి దాత సహకారం మరింత మందికి అన్నప్రసాదం అందించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

అన్నదాన సహకారం, వివరాల కోసం సంప్రదించండి:


98666 93525

95502 57551

99898 87323

శ్రీ ధర్మశాస్త్ర అన్నప్రసాద సేవా సమితి విజ్ఞప్తి: రండి.. అన్నదాన మహాయజ్ఞంలో భాగస్వాములవుదాం. అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం అందించే పవిత్రమైన సేవలో మీ వంతు సహకారం అందించి ధర్మశాస్త్ర సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్దాం.

ఉచితంగా పశువులకు నట్ల నివారణ కార్యక్రమం



బషీరాబాద్ నవంబర్ 2 ప్రజా జ్యోతి వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల దామర్ చెడ్ గ్రామంలో సోమవారం దూడలకు ఉచిత నటల నివారణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా పశుసంవర్ధక శాఖ మన తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు ఉచిత నట్టల నివారణ మందులు వేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర ఏం బసప్ప డి రవి ఓఎస్ రైతులు శంకరు మొగులప్ప తదితరులు పాల్గొనడం జరిగినది

ఫార్మసీ రంగ సమగ్ర అభివృద్ధికి అరుగొండ శ్రీధర్ గుప్తా నాయకత్వం దిశానిర్దేశం!

ఫార్మసీ చట్టం పటిష్ఠ అమలు, కమ్యూనిటీ ఫార్మసిస్టులకు గుర్తింపు, వృత్తిపరమైన ప్రమాణాల పెంపుతో తెలంగాణను జాతీయ స్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దాలి

తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్ శ్రీ అరుగొండ శ్రీధర్ గుప్తాకు ప్రొఫెసర్ డా. గంప విజయకుమార్ మర్యాదపూర్వక శుభాకాంక్షలు

నాగారం, నవంబర్ 2 (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఫార్మసీ వృత్తిని మరింత బలోపేతం చేయడం, ఫార్మసీ చట్టం--1948ను పటిష్ఠంగా అమలు చేయడం, నమోదిత ఫార్మసిస్టుల వృత్తిపరమైన హక్కులు, బాధ్యతలకు తగిన గుర్తింపు కల్పించడం, ప్రజలకు సురక్షితమైన నాణ్యమైన ఔషధ సేవలను అందుబాటులోకి తీసుకురావడం వంటి లక్ష్యాలతో సమన్వయపూర్వక కార్యాచరణ అవసరమని అసోసియేషన్ ఆఫ్ కమ్యూనిటీ ఫార్మసిస్ట్స్ ఆఫ్ ఇండియా (ఏసీపీఐ) తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, ప్రముఖ ఫార్మసీ విద్యావేత్త ప్రొఫెసర్ డా. గంప విజయకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్ శ్రీ అరుగొండ శ్రీధర్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో ఫార్మసీ వృత్తి అభివృద్ధి, కమ్యూనిటీ ఫార్మసిస్టుల సేవల విస్తరణ, ఔషధ విక్రయ కేంద్రాల్లో చట్టబద్ధమైన నిబంధనల అమలు, ఫార్మసీ విద్యా ప్రమాణాల పెంపు, ప్రజారోగ్య పరిరక్షణ వంటి కీలక అంశాలపై తమ అభిప్రాయాలను, సూచనలను ఆయన ముందుంచారు.

ఫార్మసీ రంగానికి సమర్థవంతమైన నాయకత్వం అవసరం

తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్‌గా శ్రీ అరుగొండ శ్రీధర్ గుప్తా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో, రాష్ట్రంలో ఫార్మసీ వృత్తి గౌరవాన్ని పెంపొందించడంతో పాటు చట్టబద్ధమైన వృత్తిపరమైన ప్రమాణాలను మరింత బలోపేతం చేయడానికి సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని డా. గంప విజయకుమార్ అభిప్రాయపడ్డారు.ఫార్మసీ రంగంలో అర్హత కలిగిన నిపుణుల పాత్రను బలోపేతం చేయడం, నమోదిత ఫార్మసిస్టుల సేవలకు తగిన ప్రాధాన్యత కల్పించడం, వృత్తిపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించే వాతావరణాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలు రాష్ట్ర ఔషధ రంగ భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్నారు.

శ్రీ అరుగొండ శ్రీధర్ గుప్తా నాయకత్వంలో ఫార్మసీ కౌన్సిల్, సంబంధిత ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, వృత్తిపరమైన సంఘాలు పరస్పర సహకారంతో పనిచేస్తే ఫార్మసీ వృత్తి అభివృద్ధికి మరింత మెరుగైన అవకాశాలు ఏర్పడతాయనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

ఫార్మసీ చట్టం--1948 పటిష్ఠ అమలే ప్రాధాన్యం

ఫార్మసీ చట్టం--1948 ప్రధాన ఉద్దేశం ఫార్మసీ వృత్తిని నియంత్రించడం, అర్హత కలిగిన ఫార్మసిస్టుల నమోదును పర్యవేక్షించడం, వృత్తిపరమైన ప్రమాణాలను పరిరక్షించడం అని డా. గంప విజయకుమార్ వివరించారు.

రాష్ట్రంలోని ఔషధ విక్రయ కేంద్రాల్లో వర్తించే చట్టాలు, నిబంధనలు సమర్థవంతంగా అమలయ్యేలా సంబంధిత నియంత్రణ సంస్థలు తమ చట్టబద్ధ పరిధిలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మసీ చట్టంతో పాటు ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం--1940, సంబంధిత నియమాల అమలులోనూ సమన్వయం అవసరమని తెలిపారు.

అర్హత కలిగిన నమోదిత ఫార్మసిస్టుల సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడటం, ఔషధాల సరైన వినియోగంపై అవగాహన పెంచడం, ప్రజల ఆరోగ్యం మరియు భద్రతకు ప్రాధాన్యతనివ్వడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కమ్యూనిటీ ఫార్మసిస్టుల సేవలకు తగిన గుర్తింపు కల్పించాలి

ప్రజలకు అత్యంత చేరువలో ఉండే ఆరోగ్య సేవా నిపుణులుగా కమ్యూనిటీ ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని డా. గంప విజయకుమార్ తెలిపారు. వైద్యుల సూచనల ప్రకారం మందుల వినియోగంపై అవగాహన కల్పించడం, సరైన మోతాదు మరియు వినియోగ విధానాలను వివరించడం, దుష్ప్రభావాలు, ఔషధ పరస్పర చర్యలపై తగిన మార్గదర్శకత్వం అందించడం వంటి సేవలు ప్రజారోగ్య పరిరక్షణలో ముఖ్యమైనవని చెప్పారు. యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని నివారించడం, వైద్యుల సలహా లేకుండా మందులు వాడటంవల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఔషధ వినియోగంపై మార్గదర్శకత్వం అందించడం వంటి కార్యక్రమాల్లో కమ్యూనిటీ ఫార్మసిస్టుల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని సూచించారు.కమ్యూనిటీ ఫార్మసిస్టులకు నిరంతర వృత్తిపరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ప్రజారోగ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యం, ప్రతిభ ఆధారిత గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ఫార్మసీ అధ్యాపకులు, పరిశోధకుల ప్రతిభకు ప్రోత్సాహం

ఫార్మసీ విద్యార్థులను నైపుణ్యం, నైతిక విలువలు, శాస్త్రీయ దృక్పథం కలిగిన నిపుణులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు, పరిశోధకుల పాత్ర అత్యంత కీలకమని డా. గంప విజయకుమార్ పేర్కొన్నారు. నాణ్యమైన బోధన, వినూత్న పరిశోధనలు, శాస్త్రీయ ప్రచురణలు, విద్యార్థులకు మార్గదర్శకత్వం, నూతన ఔషధ ఆవిష్కరణలకు దోహదపడే కృషిని గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

అత్యుత్తమ సేవలు అందిస్తున్న కమ్యూనిటీ ఫార్మసిస్టులు, ఫార్మసీ అధ్యాపకులు, పరిశోధకులకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక పురస్కారాలు, ప్రశంసాపత్రాలు, వృత్తిపరమైన గౌరవాలు అందించే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఫార్మసీ రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాల దిశగా తీసుకెళ్లాలి ఔషధ తయారీ, జీవసాంకేతిక పరిశోధనలు, ఔషధ ఆవిష్కరణల్లో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని డా. గంప విజయకుమార్ తెలిపారు. ఈ పారిశ్రామిక ప్రగతికి



అనుగుణంగా కమ్యూనిటీ ఫార్మసీ, క్లినికల్ ఫార్మసీ, రోగి భద్రత, ఔషధ వినియోగ పర్యవేక్షణ, ఫార్మసీ విద్య, పరిశోధన రంగాల్లోనూ నాణ్యతా ప్రమాణాలను మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఫార్మసీ కౌన్సిల్, విద్యాసంస్థలు, వృత్తిపరమైన సంఘాలు, ఔషధ పరిశ్రమలు, ప్రభుత్వ ఆరోగ్య శాఖల మధ్య సమన్వయం పెరిగితే యువ ఫార్మసిస్టులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పరిశోధన రంగంలో పురోగతికి మరిన్ని మార్గాలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు.

ప్రజారోగ్య పరిరక్షణే ఫార్మసీ వృత్తి పరమావధి

ఔషధ రంగం ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో ముడిపడి ఉన్నందున వృత్తిపరమైన నైతికత, బాధ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డా. గంప విజయకుమార్ స్పష్టం చేశారు. నకిలీ మందులు, అనధికారిక ఔషధ విక్రయాలు, మందుల దుర్వినియోగం వంటి సమస్యలను అరికట్టేందుకు చట్టబద్ధమైన పర్యవేక్షణతో పాటు ప్రజల్లో అవగాహన పెంపొందించడం అవసరమన్నారు.

"ఫార్మసిస్టుల సేవలకు గుర్తింపు, ఫార్మసీ అధ్యాపకులు మరియు పరిశోధకుల ప్రతిభకు ప్రోత్సాహం, ఫార్మసీ చట్టాల పటిష్ఠ అమలు -- ఈ మూడు అంశాలు సమన్వయంతో ముందుకు సాగినప్పుడే ఔషధ రంగం మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుంది. తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ నాయకత్వంలో వృత్తిపరమైన ప్రమాణాలు, ప్రజారోగ్య పరిరక్షణ, ఫార్మసిస్టుల గౌరవం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్ శ్రీ అరుగొండ శ్రీధర్ గుప్తా నాయకత్వంలో రాష్ట్ర ఫార్మసీ రంగం సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ, ఈ లక్ష్యాల సాధనలో ఏసీపీఐ తెలంగాణ రాష్ట్ర శాఖ తరఫున తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రొఫెసర్ డా. గంప విజయకుమార్ తెలిపారు.

ప్రొఫెసర్ డా. గంప విజయకుమార్
అధ్యక్షులు -- అసోసియేషన్ ఆఫ్ కమ్యూనిటీ ఫార్మసిస్ట్స్ ఆఫ్ ఇండియా (ఏసీపీఐ), తెలంగాణ రాష్ట్ర శాఖ
సీనియర్ ఫార్మసీ విద్యావేత్త

లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ శిక్షణ


రాష్ట్ర ఐటి శాఖ మంత్రివర్యులు శ్రీధర్ బాబు






తలకొండపల్లి,నవంబర్ 02 (ప్రజాజ్యోతి): తెలంగాణలోని లక్ష మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ),క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం ప్రకటించారు.సోమవారం హైదరాబాద్ లోని డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్),అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యుఎస్) మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది.ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లో ఈ శిక్షణ అమలు చేస్తామన్నారు.విద్యార్థులకు కేవలం సైద్ధాంతిక పరిజ్ఞానమే కాకుండా ఏ డబ్ల్యూ ఎస్ క్లౌడ్ కన్సోల్ ద్వారా ప్రాక్టికల్ అనుభవం కూడా కల్పిస్తామని తెలిపారు.ఇంజినీరింగ్,సైన్స్ తో పాటు ఆర్ట్స్,కామర్స్ విద్యార్థులకు కూడా ఈ అవకాశం ఉంటుందన్నారు.శిక్షణలో భాగంగా విద్యార్థులకు అనేక ప్రత్యేక అవకాశాలు లభించనున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులకు ఏఐ,క్లౌడ్ కంప్యూటింగ్,డేటా ఇంజినీరింగ్,మెషిన్ లెర్నింగ్,జనరేటివ్ ఏఐ వంటి అత్యాధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ అందిస్తారు.ఏడబ్ల్యుఎస్ క్లౌడ్ కన్సోల్ ద్వారా ప్రత్యక్ష ప్రాక్టికల్ శిక్షణ కల్పించడంతో పాటు ఇంజినీరింగ్,సైన్స్ విద్యార్థులే కాకుండా ఆర్ట్స్,కామర్స్ వంటి నాన్-స్ట్రీమ్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు కూడా ప్రత్యేక శిక్షణా మార్గాలు ఉంటాయి.అంతేకాకుండా ఏడబ్ల్యుఎస్ స్కిల్ బిల్డర్ ద్వారా ఏడాది పాటు 900కు పైగా ఆన్‌లైన్ కోర్సులను ఉచితంగా అభ్యసించే అవకాశం,అంతర్జాతీయ సర్టిఫికేషన్ పరీక్షలకు ప్రత్యేక డిస్కౌంట్ వోచర్లు, టెక్నాలజీ రంగ నిపుణులతో సమావేశాలు,హ్యాకథాన్ల నిర్వహణ,శిక్షణ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ ఫెయిర్ల నిర్వహణ,పాల్గొనే కళాశాలల అధ్యాపకులకు కూడా ఏఐ,క్లౌడ్ టెక్నాలజీలపై శిక్షణ వంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించనున్నారు.ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి,ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.వి.బాలకిష్టారెడ్డి,టాస్క్ సీఈఓ నితిన్ రెడ్డి,టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,ఏడబ్ల్యుఎస్ ఇండియా ప్రెసిడెంట్ సందీప్ దత్తా తదితరులు పాల్గొన్నారు.

పడకల్ శివాలయ కాలనీలో ఎయిర్‌టెల్ టవర్ ఏర్పాటుపై కలెక్టర్ కు ఫిర్యాదు





తలకొండపల్లి,నవంబర్ 02 (ప్రజాజ్యోతి): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పడకల్ గ్రామంలోని శివాలయ కాలనీలో నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయనున్న ఎయిర్‌టెల్ సెల్ టవర్ ను తక్షణమే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.శివాలయ కాలనీ పూర్తిగా నివాస ప్రాంతమని,ఇక్కడ సెల్ టవర్ ఏర్పాటు చేస్తే వెలువడే రేడియేషన్ వల్ల చిన్న పిల్లలు,గర్భిణీలు,వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.నిబంధనల ప్రకారం నివాస ప్రాంతానికి కనీసం 100 మీటర్ల దూరంలో టవర్ ఏర్పాటు చేయాలని కోరారు.అనంతరం కందుకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్రామస్తులు నిరసన తెలిపారు.ఎలాంటి అనుమతులు లేకుండా,గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా టవర్ పనులు చేపడుతున్నారని,అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.గతంలో ఇతర ప్రాంతాల్లో టవర్ల వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలకు గురైన ఉదంతాలను వారు గుర్తు చేశారు.ఈ విషయంపై స్పందించిన అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు.టవర్ నిర్మాణాన్ని నిలిపివేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శివాలయ కాలనీ వాసులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధికార్ల కొరత

సిబ్బంది లేక ఇబ్బందులు

టౌన్ ప్లానింగ్ నుంచి అన్ని శాఖల్లో సిబ్బంది కోరతే?

పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు

సి.ఎం.సి.లో ఇంచార్జిల ఇష్టారాజ్యం

70 మంది చేయవలసిన పని

21 మందితో సరి

అధికార్ల లేమితో అక్రమార్కుల ఆటలు

ప్రజల సమస్యలు కనిపించవా పాలకులకు?

కూకట్ పల్లి నవంబర్ 2(ప్రజా జ్యోతి):-ఆల్విన్ కాలనీ డివిజన్‌లో అధికారుల కరువు.70 మంది చేయాల్సిన విధులు 21 మందితోనే నిర్వహణ.అధికారుల పర్యవేక్షణ లేక అక్రమార్కులకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది? ప్రజల సమస్యలు ప్రభుత్వ పెద్దలకు పట్టవా? ఆల్విన్ కాలనీ డివిజన్‌లో అధికారుల కొరత తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. సుమారు 70 మంది అధికారులు, సిబ్బంది అవసరమైన చోట కేవలం 21 మందితోనే విధులు నిర్వహిస్తూ ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 49 మంది సిబ్బంది కొరత ఉన్నట్లు చెబుతున్నప్పటికీ, ఈ సమస్యను పరిష్కరించాల్సిన ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆరు కీలక విభాగాల్లో సిబ్బంది కొరత ప్రభావం వలన పాలన గాడితపుతుంది. టౌన్ ప్లానింగ్ అధికారులు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల కొరతతో భవన నిర్మాణాల పర్యవేక్షణ కుంటుపడింది.అక్రమ నిర్మాణాలను అడ్డుకునే నాధుడే కరువయ్యారు.

శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు సరిపడా లేకపోతే పారిశుద్ధ్య నిర్వహణ ఎలా సాధ్యం?ఏఈలు, డీఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు లేకుండా అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించేది ఎవరు? ఫీల్డ్ సిబ్బంది, సూపర్‌వైజర్ల కొరతతో దోమల నివారణ, ఇతర వ్యాధుల నియంత్రణ చర్యలు ఎలా అమలవుతాయి?రెవెన్యూ అధికారులు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల కొరతతో పన్నుల వసూళ్లు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఎలా జరుగుతోంది? వెటర్నరీ అధికారులు, సిబ్బంది కొరతతో వీధి జంతువుల నిర్వహణ, సంబంధిత సేవలు ఎవరి పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి? ఈ ముఖ్యమైన శాఖలలో సరిపడ సిబ్బంది లేక ప్రజల అవసరాలకు అనుగుణంగా విధులు నిర్వహించే ప్రసక్తే లేదు.

ఇన్‌చార్జిల ఇష్టారాజ్యమేనా?

పూర్తిస్థాయి అధికారుల నియామకాలు లేకపోవడంతో ఇన్‌చార్జిలపైనే అదనపు బాధ్యతలు పడుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకే అధికారి పలు బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఎంతవరకు సాధ్యమవుతుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అధికారుల కొరత.. అక్రమార్కులకు అవకాశమా?

టౌన్ ప్లానింగ్‌లో అక్రమ నిర్మాణాలు, పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం, ఇంజినీరింగ్ పనుల్లో నాణ్యతా లోపాలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. సిబ్బంది కొరత కారణంగా తనిఖీలు, పర్యవేక్షణ బలహీనపడుతున్నాయనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ప్రభుత్వ పెద్దలకు సూటి ప్రశ్నలు

70 మంది అవసరమైన చోట 21 మందితోనే విధులు ఎందుకు నిర్వహిస్తున్నారు?

శాఖల వారీగా ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి?

పూర్తిస్థాయి అధికారులను నియమించకుండా ఇన్‌చార్జిలతోనే పాలన ఎందుకు?

అక్రమ నిర్మాణాలు, పారిశుద్ధ్య సమస్యలపై పర్యవేక్షణ బాధ్యత ఎవరిది?

సిబ్బంది నియామకాలపై ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు?

ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికార యంత్రాంగం ఈ సమస్యలపై ఎప్పుడు స్పందిస్తుంది?



ఆల్విన్ కాలనీ డివిజన్‌ను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను వెల్లడించాలి. అవసరమైన పూర్తిస్థాయి అధికారులను నియమించాలి. ఇన్‌చార్జిల విధులపై పర్యవేక్షణ పెంచాలి. అక్రమాలపై వస్తున్న ఆరోపణలను విచారించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి. 70 మంది చేయాల్సిన పనిని 21 మందితో ఎంతకాలం నెట్టుకొస్తారు? ఆల్విన్ కాలనీ ప్రజలకు పూర్తిస్థాయి పాలన అందించాల్సిన బాధ్యత ఎవరిది? ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలి!

ఇప్పటికైనా ఉన్నతాధికారులు కళ్లు తెరిచి ఆల్విన్ కాలనీ డివిజన్ లో శాఖల వారీగా అధికారులు, క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్థానికుల డిమాండ్.

సర్కిల్ 51 డి సి చాముండేశ్వరి:

సరైన సిబ్బంది లేక శాఖల సమన్వయం కొంచెం ఇబ్బందిగా మారింది. అన్ని శాఖలలో సరిపడ అధికారులు లేకపోవడంతో కొన్ని శాఖల పనులు నత్తనడకన సాగుతున్నాయి. డివిజన్ పరిధిలో ఎదుర్కొనే సమస్యలను పైఅధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తాం. కొత్తగా ఏర్పాటు జరిగిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో కొంత సిబ్బంది కొరతకు సర్దుబాటు సమయం పడుతుందని ఆమె తెలిపారు.

అజ్మీర్ దర్గాలో ఎలుగంటి ప్రత్యేక ప్రార్థనలు

కాంగ్రెస్ నేతలతో కలిసి ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్శనం



చేవెళ్ల నవంబర్ 02 (ప్రజా జ్యోతి): రాజస్థాన్‌లోని అజ్మీర్ ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గాను రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఖ్వాజా గరీబ్ నవాజ్ ఆశీస్సులు పొందారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సౌభ్రాతృత్వాలు కలగాలని ప్రార్థించారు. ఈ పర్యటనలో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana.
Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

చేవెళ్లలో గంజాయి కలకలం

బహిరంగంగా సేవిస్తూ పట్టుబడ్డ నలుగురు

నలుగురికీ డ్రగ్ టెస్టులో పాజిటివ్

ధూల్‌పేట నుంచి తెచ్చుకుంటున్నట్లు వెల్లడి

చేవెళ్ల నవంబర్ 02 (ప్రజా జ్యోతి): బహిరంగ ప్రదేశంలో గంజాయి సేవిస్తున్న నలుగురు వ్యక్తులను చేవెళ్ల పోలీసులు పట్టుకున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని జమ్మిగడ్డలో నల్లపోచమ్మ ఆలయం సమీపంలో సోమవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నవంబర్ 2న మధ్యాహ్నం 3.45 గంటల సమయంలో కొందరు వ్యక్తులు సిగరెట్లలో గంజాయి కలుపుకొని సేవిస్తూ స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ఎస్ఐ సి. కోటేశ్వర్‌రావుకు సమాచారం అందింది. దీంతో ఆయన సిబ్బంది, క్లూస్ టీమ్‌తో కలిసి అక్కడికి చేరుకొని పంచుల సమక్షంలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

ధూల్‌పేట నుంచి కొనుగోలు

పట్టుబడిన వారిని పవన్ ఖండాజీ గైక్వాడ్ (19), గిరిగళ్ల నరేందర్ (23), ఉరడి భరత్ (26), కుమ్మరి బబ్లూ (26)గా గుర్తించారు. వీరికి గంజాయి సేవించే అలవాటు ఉందని, వ్యక్తిగత వినియోగం కోసం ధూల్‌పేట నుంచి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో చెప్పారని పోలీసులు వెల్లడించారు. నలుగురికీ పాజిటివ్ నిందితుల వద్ద, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేసినా గంజాయి లభించలేదు. అనంతరం యూరిన్ డ్రగ్ టెస్టింగ్ కిట్లతో పరీక్షలు నిర్వహించగా నలుగురికీ టి హెచ్ సి పాజిటివ్‌గా వచ్చింది. ఈ మేరకు పరీక్షల ఫలితాలను నమోదు చేసి ఫొటోగ్రాఫిక్ ఆధారాలు సేకరించారు. ఘటనపై చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో



గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

రైతులను ఆదుకోకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

కడ్తాల్ ను కరువు మండలంగా ప్రకటించే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తలకొండపల్లి/కడ్తాల్,నవంబర్ 02 (ప్రజా జ్యోతి): రైతులను ఆదుకోకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ హెచ్చరించారు.సోమవారం కడ్తాల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు.కల్వకుర్తి నియోజకవర్గంపై రేవంత్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వారు మండిపడ్డారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ...వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం కడ్తాల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం దారుణమన్నారు.బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్



రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ అందించి,రైతుబంధు,రైతుబీమా వంటి పథకాలతో రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలతో,సరైన మద్దతు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.కడ్తాల్ మండలంలో దాదాపు 80 శాతం పంటలు ఎండిపోయాయని,తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.అనంతరం మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్ మాట్లాడుతూ...కడ్తాల్ ను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.రైతులు ఆత్మహత్యలకు



పాల్పడే పరిస్థితి వచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామంలో ఆందోళనలు,రాస్తారోకోలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు శ్యామల ముదిరాజ్,వైస్ ప్రెసిడెంట్ భూపాల్,మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్,పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ,నాయకులు వీరయ్య,గోపాల్,రామచందర్,జగన్ యాదవ్,శ్రీనివాస్ గౌడ్,కోట్యా నాయక్,పాండు నాయక్,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు భీమనపల్లి శేఖర్ మృతి బాధాకరం

విధి నిర్వహణలో కుటుంబాలను సైతం పక్కనపెట్టి ప్రజా సమస్యలపై పోరాడే జర్నలిస్టులు గొప్పవారు

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి

అబ్దుల్లా పూర్ మెట్టు నవంబర్ 02 (ప్రజాజ్యోతి) ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్‌లో ప్రజాశక్తి, సూర్య దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేసిన భీమనపల్లి శేఖర్ గుండెపోటుతో ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రిపోర్టర్లుగా విధులు నిర్వహించే సమయంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుటుంబాలను సైతం పక్కనపెట్టి సమాజంలో నెలకొన్న సమస్యలపై నిరంతరం పోరాటం చేసే జర్నలిస్టులు గొప్పవారని ఆయన పేర్కొన్నారు. అలాంటి జర్నలిస్టుల కోవకు చెందిన



భీమనపల్లి శేఖర్ అకాల మరణం జర్నలిస్టు లోకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. శేఖర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వెలమకన్నే గ్రామంలో శేఖర్ భౌతికకాయానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ జే. కిషన్ (రాధాకిషన్), జిల్లా సంయుక్త కార్యదర్శి గొల్లంపల్లి ఆంజనేయులు, జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు బాణాల మధుసూదనాచారి, చాపల శ్రీనివాస్, నర్రి రమేష్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ఓటు హక్కు కీలకం టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం అసెంబ్లీ ఇంచార్జ్ బేగరి రాజు

మొయినాబాద్: నవంబర్ 02 (ప్రజా జ్యోతి) అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి బేగరి రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించారు. నిరుద్యోగ యువతీ యువకులు, పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలిలో సమర్థవంతంగా ప్రస్తావించేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగుల ఇబ్బందులు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై చట్టసభల్లో గళం వినిపించే సరైన ప్రతినిధిని ఎన్నుకోవడానికి ఈ ఓటు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఓటరు నమోదుకు అవసరమైన ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మొబైల్ నంబర్ వంటి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఆలస్యం చేయకుండా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.అంతేకాకుండా తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇతర పట్టభద్రులకు కూడా ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి వారిని నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, యువత ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించాలంటే పట్టభద్రులంతా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని బేగరి రాజు విజ్ఞప్తి చేశారు,



గ్లోబల్ సమ్మిట్ కు ముందే అన్ని ఏర్పాట్లు జరగాలి

మంత్రి వివేక్ వెంకటస్వామి

స్కిల్ యూనివర్సిటీ సందర్శన, గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం



యాచారం, అక్టోబర్ 02 (ప్రజాజ్యోతి): త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ కోసమై ఏర్పాట్లను త్వరితగతిన సిద్ధం చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. స్కిల్ యూనివర్సిటీ పనులతో పాటు, గ్లోబల్ సమ్మిట్ దృష్ట్యా పలు పరిశ్రమల భాగస్వామ్యంతో కొనసాగుతున్న పనులను మంత్రి మీర్ఖాన్ పేట్ పోలీసులతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. రిత్విక్ కంపెనీ చేపట్టిన రేడియల్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమ్మిట్ ప్రారంభానికి ముందే అన్ని పనులు పూర్తయ్యేలా ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. కేయంవి, కేఎన్ఆర్, ఎంఈఐఎల్ కంపెనీలు పనులు వేగవంతం చేయాలని ఇందుకోసమై అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సమయం సమీపిస్తుండడంతో నిర్దిష్ట గడువులోగా పనుల ఏర్పాట్లు జరగాలని సూచించారు. మంత్రి ఏర్పాట్ల సందర్శనతో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో పోలీసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీపై ఆలోచన

అన్ని పరిస్థితులు అనుకూలిస్తే భార్య అరుణజ్యోతిని బరిలో నిలుపుతాం

ప్రజల అభిప్రాయాలు, ఆశీస్సులు, మద్దతు కోరిన సామాజిక కార్యకర్త తెలుకుంటా సతీష్ గుప్తా





బోయిన్ పల్లి, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): గత 15 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని సామాజిక కార్యకర్త తెలుకుంటా సతీష్ గుప్తా తెలిపారు. ఎలాంటి పదవిలో లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నానని పేర్కొన్నారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో బోర్డు ఎన్నికల కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్నికలపై స్పష్టత లేకపోవడం బాధాకరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేసేందుకు రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక అవకాశంగా భావిస్తున్నట్లు వెల్లడించారు.అన్ని పరిస్థితులు అనుకూలించి, ప్రజల ఆశీస్సులు, మద్దతు, ప్రోత్సాహం లభిస్తే తన భార్య తెలుకుంటా అరుణజ్యోతిని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీకి నిలబెట్టాలని ఆలోచిస్తున్నట్లు సతీష్ గుప్తా తెలిపారు.ఇది కేవలం తమ కుటుంబానికి సంబంధించిన నిర్ణయం కాదని, ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేసే దిశగా ఆలోచిస్తున్న అంశమని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రజలు, పట్టభద్రులు తమ విలువైన సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను గౌరవంగా స్వీకరిస్తామని తెలిపారు.మీ ఆశీస్సులే మా బలం.. మీ మద్దతే మా ప్రేరణ.. ప్రజాసేవే మా లక్ష్యం అని తెలుకుంటా సతీష్ గుప్తా పేర్కొన్నారు.

పట్టభద్రులారా.. ఓటు హక్కు పొందండి!

నవంబర్ 6తో ముగియనున్న ఓటరు నమోదు గడువు

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాటరి దశరథ్ పిలుపు



చేవెళ్ల నవంబర్ 2 (ప్రజా జ్యోతి): అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాటరి దశరథ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో సమర్థవంతంగా ప్రస్తావించేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు గొప్ప ఆయుధమని, అర్హులైన వారు ఓటరు నమోదును నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. నవంబర్ 6 ఓటరు నమోదుకు చివరి తేదీ అని, గడువు ముగియక ముందే అర్హులైన పట్టభద్రులంతా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదుకు ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటో, మొబైల్ నంబర్ అవసరమని తెలిపారు. తెలంగాణ ఎన్నికల అధికారిక వెబ్‌సైట్‌లో ఫారం-18 ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పట్టభద్రులు వెంటనే తమ పేర్లు నమోదు చేసుకోవడంతోపాటు, గ్రామాల్లోని ఇతర అర్హులైన పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఓటు హక్కుతో తమ సమస్యలను శాసనమండలిలో వినిపించే ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని దశరథ్ కోరారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను పరిశీలించి యువత తమ నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ఖైదీల మానసిక ఆరోగ్యం, ఆనందం కోసం ఉల్లాసం

చంచల్ గూడ జైల్లో ప్రత్యేక కార్యక్రమం

ప్రారంభించిన జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా

హైదరాబాద్ (ప్రజాజ్యోతి) ఖైదీలలో మానసిక ఒత్తిడి, నిరాశ, ప్రతికూల ఆలోచనలు, స్వీయహాని ప్రవర్తన మరియు ఆత్మహత్యా ప్రవృత్తులను తగ్గించడంతో పాటు, వారిలో ఆనందం, సానుకూల ఆలోచనలు మరియు మానసిక ప్రశాంతతను పెంపొందించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో "ఉల్లాసం" అనే నూతన కార్యక్రమాన్ని చంచల్గూడ కేంద్ర కారాగారం మరియు మహిళా ప్రత్యేక కారాగారం, హైదరాబాద్లో ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఆలోచనతో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని ఖైదీలను వినోద, క్రీడా మరియు ఇతర సృజనాత్మక కార్యకలాపాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం ద్వారా వారి మానసిక ఆరోగ్యం మరియు భావోద్వేగ శ్రేయస్సును మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా చేపట్టారు. తెలంగాణ జైళ్ల శాఖ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు హైదరాబాద్కు చెందిన ట్రెస్టిల్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ముందుకు వచ్చి సహకారం అందిస్తోంది.





చంచల్గూడ కేంద్ర కారాగారం మరియు మహిళా ప్రత్యేక కారాగారం, హైదరాబాద్లో క్రీడా కార్యక్రమాలను జెండా ఊపి ప్రారంభించిన డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా, ఖైదీలు ఉత్సాహంగా పాల్గొనాలని ప్రోత్సహించారు. ఇటువంటి కార్యక్రమాలు ఖైదీలలో ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు భావోద్వేగ సమతుల్యతను పెంపొందించడానికి సహాయపడతాయని ఆమె పేర్కొన్నారు. ఖైదీలలో మానసిక ఆందోళన, ప్రతికూల ఆలోచనలు మరియు ఆత్మహత్యా ప్రవృత్తులను తగ్గించడంతో పాటు, వారి శక్తిని సానుకూల కార్యకలాపాల వైపు మళ్లించి, జైళ్లలో ఆహ్లాదకరమైన మరియు సహాయక వాతావరణాన్ని ఏర్పరచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చంచల్గూడ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ శ్రీ ఎన్. శివకుమార్ గౌడ్ మరియు మహిళా ప్రత్యేక కారాగారం, హైదరాబాద్ డిప్యూటీ సూపరింటెండెంట్ బి. అమరావతి, తమ సిబ్బందితో కలిసి ఉల్లాసం కార్యక్రమాన్ని ఆయా జైళ్లలో సమన్వయం చేసి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ వై. రాజేష్, ఐజీ జైళ్లు (వెల్ఫేర్), మరియు శ్రీ ఎన్. మురళీ బాబు, ఐజీ జైళ్లు (అడ్మినిస్ట్రేషన్) హాజరయ్యారు

దక్షిణ హైదరాబాద్‌లో ఈఐపీఎల్ గ్రూప్ భారీ విస్తరణ

రెండు నూతన రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లు ప్రారంభం

సోమాజిగూడ,నవంబర్2(ప్రజాజ్యోతి) : హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ రంగం వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తున్న వేళ, ప్రముఖ నిర్మాణ సంస్థ ఈఐపీఎల్ గ్రూప్ తన కార్యకలాపాలను మరింత విస్తరించిందని ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు పశ్చిమ హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మక రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లను విజయవంతంగా పూర్తి చేసిన ఈ డెవలపర్, తాజాగా దక్షిణ హైదరాబాద్ కారిడార్‌లోకి



అడుగుపెట్టిందన్నారు. ఇందులో భాగంగా 'ట్రెజర్ ట్రోవ్' , 'ఆర్బిస్' పేర్లతో రెండు వేర్వేరు లైఫ్‌స్టైల్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లను ప్రకటించిందన్నారు. దక్షిణ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఎస్టేట్ జీవనశైలితో పాటు ఆధునిక కమ్యూనిటీ ఆధారిత అపార్ట్‌మెంట్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్‌లను డిజైన్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఐపీఎల్ గ్రూప్ ప్రతినిధి చైతన్య చల్లా మాట్లాడుతూ "దక్షిణ హైదరాబాద్ ప్రస్తుతం అత్యంత ఆకర్షణీయమైన రెసిడెన్షియల్ ప్రాంతంగా రూపుదిద్దుకుంటోంది. ఇదే నేపథ్యంలో సుదీర్ఘ దృక్పథంతో మేము ఈ ప్రాంతంలోకి ప్రవేశిస్తున్నామన్నారు. ట్రెజర్ ట్రోవ్ ప్రాజెక్ట్ ప్రైవేట్ ఎస్టేట్ జీవనశైలిని అందిస్తే, ఆర్బిస్ ప్రాజెక్ట్ ఒక సమగ్రమైన కమ్యూనిటీ ఇంటి అనుభూతిని ఇస్తుంది. పశ్చిమ హైదరాబాద్‌లో మేము సాధించిన విజయాన్ని, పొందిన అనుభవాన్ని ఇక్కడ కూడా కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు.

నిల్వ ఉన్న భారీ బాణసంచా స్వాధీనం.. ఒకరి అరెస్ట్

సుమారు 81 రకాల భారీ బాణాసంచా స్వాధీనం

దీపావళి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

సిఐ నందీశ్వర్ రెడ్డి

యాచారం, అక్టోబర్ 02 (ప్రజాజ్యోతి): రానున్న దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచాకు అధిక ప్రాధాన్యత ఉండడంతో కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా అక్రమంగా రక్షణ లేని బాణసంచాను నిల్వ ఉంచుతున్నారని పోలీసులు చెప్పారు. నక్కగుట్ట తండా లో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ బాణసంచాను యాచారం పోలీసులు స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. సిఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు.. నక్కగుట్ట తండాలోని ఓ ఇంట్లో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా భారీగా బాణసంచా నిల్వ ఉంచారన్న పక్కా సమాచారంతో పోలీసులు ఆ ఇంటిపై దాడులు చేశారు. దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన వివిధ రకాల లక్ష్మీ టైం బాంబులు, చటపటలు (200 కి పైగా బండిల్స్), 1000, 2000, 5000 వాలా పేలుడు గొలుసులు, హైడ్రో బాంబులు, కింగ్ కాంగ్ బాంబులు, డీలక్స్ బాంబులు, రకరకాల కాకర పువ్వొత్తులు, భూచక్రాలు, విష్ణుచక్రాలు, 12, 30, 60, 100, 120 షాట్ల ఫ్యాన్సీ స్కై షాట్లు, బొమ్మ పిస్తోళ్లు, క్యాప్స్, బుల్లెట్ బాంబులు, లూజ్ క్రాకర్స్ తో కూడిన సుమారు 81 రకాల భారీ బాణాసంచా స్వాధీనం చేసుకొని విస్లావత్ అనే వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగే బాణసంచా నిర్లక్ష్యంగా నిల్వ ఉంచిన సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దీపావళి పండుగ నిబంధనలు ఉల్లంఘించి అనుమతులు లేని అక్రమ బాణసంచా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని సిఐ వెల్లడించారు.



మొయినాబాద్‌లో తాగునీటిని పొదుపుగా వినియోగించాలి

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం

ప్రజలకు మున్సిపల్ చైర్మన్ దుబ్బ సోనియా దర్శన్ విజ్ఞప్తి

మొయినాబాద్ : నవంబర్ 02 (ప్రజా జ్యోతి) ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉందని, రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలందరూ తాగునీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దుబ్బ సోనియా దర్శన్ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరు ప్రతి ఒక్కరి జీవితానికి ఎంతో అవసరమని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో



ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మున్సిపాలిటీ సరఫరా చేసే తాగునీటిని కేవలం తాగడానికి, వంట అవసరాలకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. వాహనాలు కడగడం, ఇంటి ముందు రోడ్లపై నీళ్లు చల్లడం వంటి అవసరం లేని పనులకు తాగునీటిని వృథా చేయవద్దని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఉన్నా, పబ్లిక్ నల్లాల నుంచి నీరు వృథాగా పోతున్నా వెంటనే సంబంధిత వార్డు సిబ్బందికి లేదా మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు. వీలైనంత వరకు కొత్త బోర్లు వేయకుండా, ఇప్పటికే ఉన్న బోర్లను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఇంటి ట్యాంకులు నిండినప్పుడు నీరు రోడ్లపైకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్) ఏర్పాటు చేసుకొని వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నీటిని ప్రతి చుక్క విలువైనదిగా భావించి పొదుపుగా వినియోగించాలని, నీటి సంరక్షణలో ప్రజలందరూ మున్సిపల్ యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని చైర్‌పర్సన్ విజ్ఞప్తి చేశారు.

దళితుల భూములకు రక్షణ కరువా?

రెవెన్యూ రికార్డులకే పరిమితమవుతున్న 38-ఈ భూములు!

వారసుల అనుమతి లేకుండానే ఆక్రమణల ఆరోపణలు

రెండు భూ వివాదాలపై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు

బాధితులకు అండగా టి.ఎం.ఆర్.పి.ఎస్.. ఇటుక గోపి మాదిగ

మేడ్చల్, నవంబర్ 2. (ప్రజా జ్యోతి): ప్రభుత్వం దళితులకు కేటాయించిన భూములకే రక్షణ లేకపోతే సామాన్యులకు న్యాయం ఎలా జరుగుతుందని టి.ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి మాదిగ ప్రశ్నించారు. దళితుల భూములు రెవెన్యూ రికార్డులకే పరిమితమా? వాటిని అనుభవించడానికి వారికి అర్హత లేదా? అని ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో దళితులకు చెందిన భూముల ఆక్రమణలపై బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

కీసర మండలంలో 38-ఈ భూమిపై వివాదం

కీసర మండలం దాయర గ్రామ పరిధిలో సర్వే నంబర్ 194లో 0.13 గుంటలు, సర్వే నంబర్ 195లో 34 గుంటల 38-ఈ భూమి పుండ్రు నరసింహ మాదిగ పేరుపై ఉన్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన వారసులైన పుండ్రు జంగయ్య మాదిగ, పుండ్రు మల్లేష్ మాదిగ, సందాన లక్ష్మి మాదిగలకు చెందిన వారసత్వ భూమిని వారి సంతకాలు, అనుమతి లేకుండానే కొందరు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు.ఈ విషయంపై సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగకపోవడంతో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుపై స్పందించిన కమిషన్ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసి 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.





గౌడెల్లిలో మూడు గుంటల భూమిపై కబ్జా ఆరోపణలు

మేడ్చల్ మండలం గౌడెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 281లో కొమ్ము యాదగిరి మాదిగ పేరుపై ఉన్న మూడు గుంటల భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. వ్యవసాయ అవసరాల కోసం ఉన్న భూమిలో భారీ షెడ్ నిర్మాణం చేపట్టడంతో వ్యవసాయ భూమి వినియోగానికి ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. భూమి వారసుల అనుమతి, సంతకాలు లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై విచారణ జరిపించాలని కోరారు.ఈ మేరకు బాధితురాలు, కొమ్ము యాదగిరి కుమార్తె స్వర్ణలతతో కలిసి ఇటుక గోపి మాదిగ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి భూమి రికార్డులను పరిశీలించి, నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

దళితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

రెండు భూ వివాదాల్లోనూ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా టి.ఎం.ఆర్.పి.ఎస్ అండగా నిలుస్తుందని ఇటుక గోపి మాదిగ తెలిపారు. దళితుల భూములను ఆక్రమించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, బాధితులపై దౌర్జన్యాలకు



పాల్పడుతున్న వారిపై విచారణ అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.ప్రభుత్వ నిబంధనలకు, చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై అధికారులు కఠినంగా స్పందించాలని, దళితుల భూములకు రక్షణ కల్పించి వారి హక్కులను కాపాడాలని ఇటుక గోపి మాదిగ డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు టి.ఎం.ఆర్.పి.ఎస్ తరఫున న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

సమతుల్య ఎరువుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలి

కెవికే వ్యవసాయ శాస్త్రవేత్తలు అధికారులు

యాచారం, అక్టోబర్ 02 (ప్రజాజ్యోతి): కెవికె క్రీడా ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ పై చౌదర్‌పల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుస్థిర వ్యవసాయం, నేల ఆరోగ్య నిర్వహణ, సమతుల్య ఎరువుల వాడకం, ప్రభుత్వ పథకాలపై దృష్టి సాధించడంపై వ్యవసాయ



శాస్త్రవేత్తలు అధికారులు అవగాహన కల్పించారు. సాగులో పోషకాల వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని నివారించాలని చెప్పారు. మట్టి పరీక్ష ఆధారిత సమతుల్య ఎరువుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పంటల్లో అధిక ఉత్పాదకతకై సేంద్రీయ పోషక వనరులతో పాటు జీవ ఎరువులను వాడడం అవలంబించాలని చెప్పారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా పంటలు కూరగాయలు పండించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, శాస్త్రవేత్తలు డాక్టర్ సుధీర్, డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ దిలీప్, ఏడిఏ శశిధర్ రెడ్డి, ఎంఏఓ రవినాథ్, వెటర్నరీ వైద్యులు సంత్, రేఖ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆపదలో నేనున్నానంటూ అండగా నిలుస్తున్న సర్పంచ్.. పేద కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం!

మరణంలోనూ మానవత్వం చాటుకున్న సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య

మోమిన్‌పేట్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి) ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవత్వానికి మారుపేరుగా నిలుస్తున్నారు కేసారం గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన మొగ్దుంపురం సంగయ్య ఆదివారం రాత్రి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ కిష్టయ్య వెంటనే స్పందించారు. తన సొంత నిధుల



నుంచి రూ.5,000 ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు తోడుగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని మరోసారి చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్, ప్రవీణ్, ఆనందం, లాయక్ అలీ, సుభాష్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దార్ ఎంపీడీవోకి వినతిపత్రం అందించిన

బషీరాబాద్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

బషీరాబాద్ నవంబర్ 2 ప్రజా జ్యోతి వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మాసమస్యలు తెలంగాణ రాష్ట్రంలో 194 మోడల్ స్కూల్ గతంలో 13 సంవత్సరాలుగా ఉపాధ్యాయ ఉద్యోగులుగా పనిచేస్తున్నాం మోడల్ స్కూల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రభుత్వానికి 12 ప్రధానమైన డిమాండ్లతో తెలంగాణ మోడల్ స్కూల్ ను విలీనం చేసి ఉద్యోగులు వేతనాలను 010 హెడ్ అకౌంట్ ద్వారా చెల్లించాలి మరణించిన ఉద్యోగ కుటుంబంలో ఉద్యోగం కల్పించాలి ఎస్జిటిలకు 2013 నుండి నేషనల్ సర్వీస్ కల్పించాలి సీనియారిటీ ప్రమోషన్లు ప్రయోజనం కల్పించారు పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలి మోడల్ స్కూల్ ఉద్యోగులందరికీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీం కల్పించాలి అర్హులైన ఉద్యోగులకు పెండింగ్ ప్రమోషన్లు వెంటనే చేపట్టాలి అవసరమైన హిందీ పిజిటి ప్రమోషన్ కల్పించాలి ఖాళీగా ఉన్న



ఉపాధ్యాయులను భర్తీ చేయాలి ప్రతి మోడల్ స్కూల్కు ఒక రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్ పోస్టును మంజూరు చేయాలి సబ్జెక్టు వైస్ గా ఉపాధ్యాయులను నియమించాలి హెచ్చిటి నెలకు కనీస వేతనం రూ 35,000 చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయాలి మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వ్యక్తిగత సమస్యలు మాత్రమే కాకుండా రాష్ట్ర విద్య వ్యవస్థకు సంబంధించిన ముఖ్యమైన అంశాలు కూడా పరిష్కరించాలని బషీరాబాద్



తహశీల్దార్ సాహిద బేగం ఎంపీడీవో సంపత్ కుమార్ కు సోమవారం వినతి పత్రం అందించారు ఇట్టి విషయాన్ని వినతి పత్రాన్ని ప్రభుత్వం ముఖ్యమంత్రి సంబంధిత శాఖ మంత్రి మరియు ఉన్నతఅధికారులకు దృష్టికి తీసుకెళ్లాలని సమస్య పరిష్కారానికి తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము ఈ కార్యక్రమంలో బషీరాబాద్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్ గోపాలకృష్ణ శ్రీనివాస్ గౌడ్ వశ్రనస్ రజిని నరసింహ సంతోష్ స్వామినాథ నరేష్ హరీష్ తదితరులు పాల్గొన్నారు

నీటిని వృధా చేయొద్దు!

నీటి సంరక్షణ అందరి బాధ్యత

తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి





తాండూరు నవంబర్ 2 ప్రజా జ్యోతి :- రానున్న కాలంలో నీటి సమస్య అధికంగా రానుండడంతో ప్రజలు నీటిని వృధా చేయొద్దని అది భావి తరాలకు ఎంతో ఇబ్బందికరంగా మారనుందని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులచే అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం రోజు తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో నీటి పొదుపు చేయడంతో పాటు నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం మన అందరి బాధ్యతని చెప్పారు. తాండూర్ పట్టణంలోని పలు ప్రధాన వీధులలో నీటిని పొదుపు చేద్దాం నీళ్లను భావితరాలకు ఉపయోగపడే విదంగా మద్దతు తెలుపుదామని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, పలు ప్రైవేట్ పాఠశాలల సిబ్బంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నీరు మన జీవనాధారమని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు.విద్యార్థులు నీటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రజలను చైతన్య పరిచే విధంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం సంతోషకరమన్నారు. అలాగే భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ నీటిని పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.నేటి నీటి పొదుపే రేపటి తరాలకు భరోసా" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు విద్యార్థులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

కృష్ణానదిలో మల్లేశ్వరం ద్వీపం



మహబూబ్ నగర్ : నల్లమల అటవీ అందాలు, కృష్ణానది పరవళ్లు, ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనంతో ప్రత్యేక గుర్తింపు పొందిన కొల్లాపూర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. సోమశిల, మల్లేశ్వరం ప్రాంతాల్లో రూ.57.63 కోట్లతో పనులు చేపట్టారు. సోమశిల ఆలయంలో రూ.6 కోట్లతో వసతి, క్యాంటీన్, పిల్లల ఆటస్థలం ఏర్పాటు చేస్తున్నారు. మల్లేశ్వరం ద్వీపంలో రూ.47.44 కోట్లతో 30 కాటేజీలు, స్పా, వాచ్‌టవర్, బోటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నారు. బోటింగ్ పనులు పూర్తికాగా, ఇతర పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.చుట్టూ పచ్చని నల్లమల అటవీ ప్రాంతం.. చెంతనే పరవళ్లు తొక్కే కృష్ణానది.. ఒకేచోట ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం.. ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక వైభవం కలగలిసిన కొల్లాపూర్ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. తెలంగాణలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల, పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం ప్రాంతాల్లో సుమారు రూ.57.63 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాయి. ఆర్నెల్లుగా కొనసాగుతున్న ఈ పనులు పూర్తయితే పర్యాటకులకు బస, బోటింగ్, వినోదం, ఆధ్యాత్మిక సందర్శన వంటి అనేక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.కొల్లాపూర్ మండలంలోని సోమశిల శ్రీలలితా సోమేశ్వర ఆలయం ఈ ప్రాంతానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ ఆలయంలోనే ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకునే అవకాశం ఉండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించేందుకు రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా నాలుగు డార్మిటరీ గదులు, ప్రసాద పంపిణీ కేంద్రం, క్యాంటీన్, చిన్నపిల్లల కోసం ఆటస్థలం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న పనులు సుమారు 50 శాతం పూర్తయ్యాయి. వీటితో కుటుంబ సమేతంగా వచ్చే పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు కలగనున్నాయి.మరోవైపు పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం వద్ద కృష్ణానదిలో ఉన్న ద్వీపాన్ని ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.47.44 కోట్లు మంజూరు చేసింది. ద్వీపం ప్రకృతి అందాలను ఆస్వాదించేలా 30 కాటేజీలు, స్పా ఏరియా, వాచ్‌టవర్, బోటింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. నదీ జలాల మధ్య ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకునే పర్యాటకులకు ఈ ప్రాంతం ప్రత్యేక అనుభూతిని అందించనుంది. ప్రస్తుతం ఐలాండ్ అభివృద్ధి పనులు సుమారు 30 శాతం పూర్తయ్యాయి. జూన్ నాటికి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పర్యాటకశాఖ ఏఈఈ తెలిపారు.సోమశిలకు వచ్చే పర్యాటకులకు బోటింగ్ ప్రధాన ఆకర్షణగా ఉంది. కృష్ణానదిలో పడవ ప్రయాణం ద్వారా నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించే అవకాశం ఉండటంతో పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వీఐపీ పుష్కరఘాట్ వద్ద రూ.1.69 కోట్లతో బోటింగ్ సంబంధిత పనులను పూర్తి చేశారు. అదనంగా రూ.2.50 కోట్లతో బోటింగ్ షెడ్డు నిర్మించాల్సి ఉంది. ఘాట్ వద్ద పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తే పడవ ప్రయాణం మరింత సులభతరం కానుంది. ప్రస్తుతం పుష్కరఘాట్ అభివృద్ధి పనులు 40 శాతం పూర్తయ్యాయి.మొత్తంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టిన రూ.57.63 కోట్ల పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం రూ.10.19 కోట్లు కేటాయించింది. సోమశిల, మల్లేశ్వరం ప్రాంతాల్లో వివిధ పనులను దశలవారీగా చేపడుతున్నారు. ఇప్పటివరకు బోటింగ్ పనులు పూర్తికాగా.. ఆలయ అభివృద్ధి పనులు సగం, పుష్కరఘాట్ పనులు 40 శాతం, మల్లేశ్వరం ఐలాండ్ పనులు 30 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, నదీ విహారం, ద్వీప పర్యాటకం ఒకేచోట ఉండటం కొల్లాపూర్ ప్రత్యేకత. సోమశిల ఆలయ దర్శనంతో పాటు మల్లేశ్వరం ద్వీపంలో బస, బోటింగ్, నల్లమల ప్రకృతి అందాలను ఆస్వాదించేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రాజెక్టులు పూర్తయితే నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కొల్లాపూర్ మరో ఆకర్షణీయమైన విహార గమ్యస్థానంగా మారనుంది.

జూబ్లీహిల్స్, తార్నక..

మితిమీరుతున్న సౌండ్ పొల్యూషన్

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో శబ్ద కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, చివరకు నిశ్శబ్ద ప్రాంతాలుగా ప్రకటించిన జోన్లలోనూ అనుమతించిన పరిమితులకు మించి శబ్దాలు నమోదవుతున్నాయి. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి 2026 జనవరి నుంచి జులై వరకు సేకరించిన గణాంకాలు ఈ పరిస్థితిని వెల్లడిస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో పగలు, రాత్రి వేళల్లోనూ శబ్ద స్థాయిలు నిర్దేశిత ప్రమాణాలను దాటుతున్నాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్, తార్నాకలోని నివాస ప్రాంతాల్లో పర్యవేక్షణ జరిగిన కాలమంతా అనుమతించిన స్థాయికి మించి శబ్ద కాలుష్యం నమోదైంది. వాణిజ్య ప్రాంతమైన జేఎన్‌టీయూలోనూ ఇదే పరిస్థితి కొనసాగగా.. అబిడ్స్‌లో పలు నెలలపాటు రాత్రి వేళల్లో పరిమితులు ఉల్లంఘించినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

నగరంలో శబ్ద కాలుష్యానికి వాహనాల రాకపోకలు, అనవసర హారన్ల మోత ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. అధిక శబ్దంతో మోగించే డీజేలు, నిర్మాణ పనులు, ఫంక్షన్ హాళ్లలో జరిగే కార్యక్రమాలు కూడా సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్ల వద్ద పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. రోడ్డు భద్రత కార్యకర్త అరుణ్ బతులా తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితికి ముందు ఆయన ట్రాఫిక్ పోలీసులతో కలిసి సచివాలయం సమీపంలోని తెలంగాణ తల్లి కూడలిలో గంటపాటు శబ్ద స్థాయిలను పరిశీలించారు. ఆ సమయంలో 82 నుంచి 110 డెసిబెల్స్ వరకు శబ్దం నమోదైంది. నిరంతరం వినిపించే హారన్లను ఎలా భరిస్తున్నారని అక్కడి సిబ్బందిని అడిగితే, ఆ శబ్దాలకు అలవాటు పడిపోయామని కొందరు చెప్పినట్లు ఆయన వివరించారు. మరికొందరు నిద్రలోనూ హారన్ల శబ్దాలు వినిపిస్తున్నాయని చెప్పడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అనవసరంగా హారన్లు మోగించకుండా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ తెలిపారు. హెచ్‌సీఎస్‌సీ వాలంటీర్ల సహకారంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అదనపు మఫ్టీ హారన్లు అమర్చిన వాహనాలపై క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, హారన్లే శబ్ద కాలుష్యానికి ప్రధాన కారణమని, శివారు ప్రాంతాల్లో నిర్మాణ పనుల వల్ల శబ్దం ఎక్కువగా ఉంటోందని వివరించారు.

ఎన్ పోర్స మెంట్ దాడుల్లో హోటల్స్.....

హైదరాబాద్ : భాగ్యనగరంలో బిర్యానీ, చాయ్, రుచికరమైన వంటకాల కోసం నిత్యం వేలాది మంది క్యూ కట్టే ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్ల అసలు బండారం ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడుల్లో బట్టబయలైంది. టీజీ సేఫ్ విభాగం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 22 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు గోల్కొండ, చార్మినార్ జోన్లలో ఏకకాలంలో భారీ తనిఖీలు చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో నగరంలో అత్యంత పేరుగాంచిన షాగౌస్, హోటల్ నయాబ్, మెహఫిల్, సౌహైల్ వంటి రెస్టారెంట్ల వంటగదుల్లో కనిపించిన దృశ్యాలు అధికారులనే నివ్వెరపరిచాయి.ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి తీవ్రమైన అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన మొత్తం 14 ప్రముఖ రెస్టారెంట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను అధికారులు తక్షణమే సస్పెండ్ చేస్తూ, వాటి కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల సందర్భంగా ప్రముఖ హోటళ్ల వంటగదుల్లో వెలుగుచూసిన పరిస్థితులు భయానకంగా ఉన్నాయి. కుళ్ళిపోయిన కూరగాయలు, ఫంగస్ పట్టిన ఆహార పదార్థాలు, ఎక్స్‌పైరీ అయిపోయిన సరుకులను యథేచ్ఛగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పచ్చి మాంసాన్ని, శాకాహార వంటకాలను నిబంధనలకు విరుద్ధంగా ఒకేచోట నిల్వ ఉంచడం, ఒకసారి వాడిన నూనెనే మళ్లీ మళ్లీ మరిగిస్తూ వంటలు చేస్తుండటం బయటపడింది.అన్నింటికంటే దారుణంగా.. వంటగదుల్లో ఎలుక రెట్టలు, బొద్దింకలు, ఈగలు స్వైరవిహారం చేస్తుండగా, కొన్నిచోట్ల కిచెన్లలో పిల్లులు తిరుగుతున్నట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. మురుగునీటి నిల్వలు, గ్రీజుతో పేరుకుపోయిన చిమ్నీలు, చితికిపోయిన ఫ్లోరింగ్ నడుము.. సిబ్బంది కనీసం ఆప్రాన్లు, హెయిర్‌నెట్స్ కూడా ధరించకుండా ఆహారాన్ని తయారు చేస్తున్నారు.లైసెన్సులు రద్దయిన 14 రెస్టారెంట్లలో శాలిబండలోని షాగౌస్ కేఫ్, నయాపూల్ హోటల్ నయాబ్, సంతోష్‌నగర్ లక్కీ రెస్టారెంట్, దిల్?సుఖ్?నగర్ మెహఫిల్, మలక్‌పేట్ సౌహైల్ రెస్టారెంట్‌లతో పాటు టోలిచౌకి, సంతోష్ నగర్‌లలోని శ్రీ రాఘవేంద్ర ఉడిపి వెజ్ హోటళ్లు, గుడిమల్కాపూర్‌లోని శ్రీ బాలాజీ ఫ్యామిలీ ధాబా, సిద్దిఖ్ కబాబ్ సెంట్రల్ కిచెన్, టోలిచౌకి అల్సుబా, మాసబ్ ట్యాంక్ డైన్ హిల్, ఎంజేఆర్ రోడ్డులోని అక్షయ టిఫిన్స్, వెంకటేశ్వర హోటల్, రేతిబౌలిలోని అజీబో రాయల్ అరేబియన్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇవన్నీ తక్షణమే తమ కార్యకలాపాలను నిలిపివేయాల్సిందేనని అధికారులు తేల్చిచెప్పారు.అలాగే, ఇంజిన్ బౌలిలోని ప్రతిష్టాత్మక తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్, శాలిబండ పిస్తా హౌస్, చార్మినార్‌లోని హోటల్ సబ్జీ, మండి ఎట్ 36 అరేబియన్ కిచెన్, సంతోష్‌నగర్ స్వీకార్ హోటల్, మాసబ్ ట్యాంక్ గోల్కొండ హోటల్ అండ్ రిసార్ట్స్, టోలిచౌకి ఇంపీరియల్ మల్టీక్యూసిన్ రెస్టారెంట్, బజార్‌ఘాట్ తైబా బేకరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉపాధ్యాయ విద్యావంతుల హక్కుల పరిరక్షణకే నా లక్ష్యం - దొబ్బిలి లక్ష్మణ్



బషీరాబాద్, నవంబర్ 2, ప్రజా జ్యోతి:రంగారెడ్డి – హైదరాబాద్ – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు దొబ్బిలి లక్ష్మణ్ ప్రకటించారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం, ఉపాధ్యాయులు, విద్యావంతుల హక్కుల పరిరక్షణకే తన లక్ష్యమని తెలిపారు.పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని, గ్రాడ్యుయేట్ల గొంతుకగా మండలిలో వినిపిస్తానని ఆయన పేర్కొన్నారు. పట్టభద్రులందరూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.

చదువుకున్న బడికి చిరు కానుక.. జ్ఞాపకాల బడిలో మళ్లీ కలిసిన 2002 బ్యాచ్!



మోమిన్‌పేట్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి) చదువుకున్న పాఠశాలను మరువకుండా, విద్యాబుద్ధులు నేర్పిన బడికి తమ వంతు సేవ చేయాలనే సంకల్పంతో 2002 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. తాము బాల్యంలో విద్యనభ్యసించిన పాఠశాల ప్రహరీ గోడకు గేట్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, అరుణ్ కుమార్, రాజేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింలు, హరిహరన్ రెడ్డి, ఎజాస్, బషీర్, రాములు, చంద్రశేఖర్, ఫారుక్, ఖాలేద్, సునీల్, శ్రీనివాస్, సురేష్, జాఫర్ అలీ, సి. రాములు, ఆనంద్, శోభన్ బాబు, అరవింద్ గౌడ్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ కసరత్తు.. రేసులో ఉన్నది వీరే!

హైదరాబాద్ : తెలంగాణలో నవంబర్ 14తో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సందడి మొదలైంది. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని మూడు స్థానాలను భర్తీ చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే పలువురు నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవుల సందడి మొదలైంది. నవంబర్ 14తో ఖాళీ కానున్న మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన నేతలు ఇప్పుడు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశం కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. మూడు స్థానాల్లో ఒకటి ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి కేటాయించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ రేసులో దొమ్మాటి సాంబయ్య, నాగరిగారి ప్రీతమ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, చారుకొండ వెంకటేష్, కూడా తమ ప్రయత్నాలు చేస్తున్నారు.ఇక ఓసీ కోటాలో బ్రాహ్మణ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలనే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వర్గం నుంచి హార్కర వేణుగోపాల్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా.. దయాసాగర్ పేరు కూడా చర్చలో ఉంది.మరోవైపు బీసీ సామాజికవర్గం నుంచి భారీగా ఆశావహులు ఉన్నారు. పద్మశాలి వర్గానికి అవకాశం దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఈ రేసులో ఈరవత్రి అనిల్, కైలాష్ నేత, సంగీశెట్టి జగదీశ్వర్, జక్కని అనితతో పాటు మరికొందరి పేర్లు వినిపిస్తున్నాయి. యాదవ సామాజికవర్గం నుంచి చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, లింగం యాదవ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. మహిళా ప్రాతినిధ్యం కోణంలో సునీత రావు పేరు వినిపిస్తోంది.మొత్తంగా మూడు ఎమ్మెల్సీ స్థానాల భర్తీలో సామాజిక సమీకరణాలే కీలకం కానున్నాయి. పదవులు దక్కని నేతలకు ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అవకాశం కల్పించే అంశం కూడా చర్చకు వస్తోంది. అయితే చివరకు కాంగ్రెస్ అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందనేది ఉత్కంఠగా మారింది

సిటీ మధ్యలో రియల్ జోరు

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తోంది. అయితే ఒకప్పుడు రియల్ ఎస్టేట్‌కు కేంద్ర బిందువైన సెంట్రల్ హైదరాబాద్ ఇప్పుడు మళ్లీ జోరు కనబరుస్తోంది. పూర్వ వైభం దిశగా వడి వడిగా అడుగులు వేస్తోంది. పాత ఇళ్ల స్థానంలో కొత్త ఆకాశ హర్మ్యాలు వెలుస్తున్నాయి. ఆకాశాన్ని తాకేలా భవనాలతో అందరి చూపుని ఆకర్షిస్తోంది.దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ముందు వరుసలో ఉంటుంది. నగరం నలుమూలల విస్తరిస్తూ మల్టీనేషనల్ కంపెనీలను ఆకర్షిస్తోంది. అయితే, ఒకప్పుడు వ్యాపార, వాణిజ్య, నివాస, ఉపాధి కేంద్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న సెంట్రల్ హైదరాబాద్ ఇప్పుడు మళ్లీ ఫోకస్‌లోకి వచ్చింది. మళ్లీ పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తోంది. బషీర్‌బాగ్, సైఫాబాద్ వంటి ప్రాంతాల్లో ఆకాశ హర్మ్యాలు వెలిశాయి. ఎత్తయిన రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ భవనాలు నిర్మితమవుతున్నాయి. బేగంపేట విమానాశ్రయం తరలింపు, ట్రాఫిక్ సమస్యల వంటి వివిధ కారణాలతో ఈ ప్రాంతం శోభ తగ్గినా.. ప్రస్తుతం పాత భవనాల పునర్నిర్మాణం, పరిశ్రమల భూముల వినియోగంలో మార్పుల ద్వారా సరికొత్త రియల్ ఎస్టేట్ రంగాను సంతరించుకుంటోంది. లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు, ఆకాశహర్మ్యాల నిర్మాణాలు జోరందుకుంటున్నాయి.నగరంలోని కోర్ సిటీలో ఖాళీ స్థలాల లభ్యత దాదాపు శూన్యం కావడంతో డెవలపర్లు రీ-డెవలప్‌మెంట్ నమూనాపై దృష్టి సారించారు. ఒకప్పుడు ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న పరిశ్రమలను బయటకు తరలించే క్రమంలో, ప్రభుత్వం ఆ భూముల కేటగిరీని నివాస ప్రాజెక్టులకు మార్చడంతో భారీ ప్రాజెక్టులకు మార్గం సుగమమైంది. పాత ఐదంతస్తుల భవనాలు, ఫ్యాక్టరీలు, స్టూడియోలను కూల్చివేసి వాటి స్థానంలో 20 నుంచి 50 అంతస్తుల భారీ నివాస కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నారు. పంజాగుట్ట, బేగంపేట, అబిడ్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, సోమాజిగూడ, కవాడిగూడ, వీఎస్‌టీ, గోల్కొండ చౌరస్తాలలో భారీ హైరైజ్ ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి.ఐటీ కారిడార్‌తో పోలిస్తే సెంట్రల్ హైదరాబాద్‌కు ఉన్న మౌలిక సదుపాయాలే దీని పునరుజ్జీవనానికి ప్రధాన కారణం. బస్సు, ఎంఎంటీఎస్ రైలు, మెట్రో కనెక్టివిటీ అందుబాటులో ఉండడం ప్లస్ పాయింట్. కేవలం 20 నుంచి 30 నిమిషాల్లో ప్రైవేట్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా గచ్చిబౌలి, హైటెక్ సిటీలకు చేరుకునే సౌలభ్యం ఉంది. నగరంలోనే అత్యుత్తమ విద్యా సంస్థలు, కార్పొరేట్ హాస్పిటళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్, హుస్సేన్ సాగర్ వంటి పర్యాటక ప్రాంతాలు సమీపంలోనే